ఈనాడు
పశ్చిమగోదావరి
బుధవారం అక్టోబరు 23, 2024


## ఉపాధిహామీ పనులు పెద్ద ఎత్తున చేపట్టాలి: కలెక్టర్


నాగరాణి

**భీమవరం కలెక్టరేట్, న్యూస్‌టుడే:** పల్లెల్లో ఉపాధి హామీ నిధులతో లక్ష్యానికి మించి పనులు చేపట్టాలని కలెక్టర్ నాగరాణి సంబంధిత అధికారులను ఆదేశించారు. డ్వామా అధికారులు, ఎంపీడీవోలతో కలెక్టరేట్‌లో మంగళవారం సమావేశం నిర్వహించారు. ఇప్పటి వరకు జిల్లాలో అత్యధికంగా పాలకొల్లు మండలంలో 91.94 శాతం పని దినాలు కల్పించగా అతి తక్కువగా వీరవాసరం మండలంలో 64.76 శాతం పని దినాలు కల్పించినట్లు తెలిపారు. పేదలు ఇతర ప్రాంతాలకు వలస వెళ్లకుండా స్థానికంగా వారికి ఉపాధి కల్పించాలని సూచించారు. జిల్లాలో మంజూరైన 850 పశువుల షెడ్లకు వెంటనే ప్రతిపాదనలు తయారు చేసి అందించాలన్నారు. డ్వామా పీడీ కేసీహెచ్ అప్పారావు, పశు సంవర్ధక శాఖ జిల్లా అధికారి మురళీకృష్ణ, వివిధ శాఖల జిల్లా అధికారులు, ఎంపీడీవోలు పాల్గొన్నారు.


**ఆధార్ శిబిరాలు సద్వినియోగం చేసుకోవాలి..** ఈ నెల 22 నుంచి 25 వరకు కొనసాగనున్న ఆధార్ శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ నాగరాణి సూచించారు. జిల్లాలో 88 చోట్ల శిబిరాలు ఏర్పాటు చేశామన్నారు.

## తగ్గిన వరద

**పోలవరం, న్యూస్‌టుడే:** గోదావరిలో వరద పూర్తిగా తగ్గడంతో పోలవరం ప్రాజెక్టు ఎగువ, దిగువ కాఫర్ డ్యాంల వద్ద పనుల నిమిత్తం టిప్పర్ల రాకపోకలకు వీలుగా గతంలో నిర్మించిన రోడ్డు బయటపడింది. గండ్ల ద్వారా ప్రస్తుతం స్పిల్‌వే నుంచి నీరు గోదావరిలోకి వెళుతోంది. మరోవైపు దిగువ కాఫర్ డ్యాం వద్ద మోటార్లు ఏర్పాటు చేసి డీప్లీటింగ్ స్లూయిజ్ ద్వారా గోదావరిలోకి నీటిని మళ్లించడంతో పాత డయాఫ్రం వాల్ నిర్మాణ ప్రాంతం మంగళవారం నాటికి కొంత మేర బయటపడింది. ప్రస్తుతం స్పిల్‌వే వద్ద నీటి మట్టం 26.70 మీటర్లకు చేరింది. 48 గేట్ల ద్వారా 70వేల క్యూసెక్కులు దిగువకు వెళుతోంది.

# ఎగిరొచ్చే సాయం

సేద్యానికి సాంకేతిక ఊతం
డ్రోన్ల వినియోగంపై సర్కారు దృష్టి


'సాగులో సాంకేతికతను పెంచుదాం. డ్రోన్ల వినియోగంపై అధికారులు దృష్టి పెట్టాలి. అనవసర పురుగు మందుల వాడకాన్ని నివారించి, చీడ పీడలున్న చోట మాత్రమే పిచికారీ చేసే విధానం అందిపుచ్చుకోవాలి'.
- చంద్రబాబునాయుడు, ముఖ్యమంత్రి

**ఈనాడు డిజిటల్, భీమవరం, తాడేపల్లిగూడెం, భీమవరం అర్బన్, న్యూస్‌టుడే**



వ్యవసాయాధారిత జిల్లాలో సేద్యానికి కూలీల కొరత ప్రధాన సమస్యగా మారిన తరుణంలో... దీనిని అధిగమించడానికి అన్నదాతలు డ్రోన్ల వినియోగం వైపు మొగ్గు చూపుతున్నారు. గత ప్రభుత్వం అయిదేళ్లు వ్యవసాయ రంగాన్ని పట్టించుకోకపోవడంతో రైతులకు కనీసం యంత్ర పరికరాలు, వాటిపై రాయితీలు కూడా అందలేదు. కిసాన్ డ్రోన్ పథకమంటూ హడావుడి చేశారు కానీ జిల్లాలో ఒక్కరికి డ్రోన్ ఇచ్చిన దాఖలాలు లేవు.

'బీటెక్ పూర్తి చేశా. వ్యవసాయంపై ఆసక్తితో 50 ఎకరాలు కౌలుకు తీసుకుని వరి సాగు చేస్తున్నాను. కూలీల కొరత, ఖర్చులు పెరగడంతో పంట సాగుకు సంబంధించి ప్రతి దశలో ఇబ్బందులు ఎదుర్కొన్నా. డ్రోన్ల వినియోగంతో వాటిని అధిగమించాను. రాయితీపై డ్రోన్లు అందిస్తే యువతకు ఉపయోగం ఉంటుంది.' అని భీమవరానికి చెందిన శ్రీనివాసరావు అన్నారు.


**ఉపయోగం ఇలా...**

● సాధారణంగా ఎకరం పొలంలో పురుగు మందుల పిచికారీకి 5-6 గంటల సమయం పడుతుంది. కూలి కింద రూ.700 నుంచి రూ.1000 వరకు చెల్లించాల్సి ఉంటుంది. డ్రోన్ల యజమానులు రూ.400కే సేవలందిస్తున్నారు. ఎకరం పొలంలో ఈ ప్రక్రియ మొత్తం 5-10 నిమిషాల్లోనే పూర్తవుతుంది. మొక్క అడుగు నుంచి పైవరకూ తడుస్తుంది.

● పంటలకు పురుగు మందులు, ఎరువులు పిచికారీ చేసేందుకు రైతులు ఎక్కువ సమయం కేటాయించాల్సి వస్తోంది. అన్నదాతల ఆరోగ్యంపై ఇది ప్రభావం చూపుతోంది.

● డ్రోన్లకు అమర్చే కెమెరాతో పంటలను ఫొటో తీయడం, చీడపీడలు గుర్తించడం చేయవచ్చు. వాటిని వ్యవసాయాధికారికి పంపి, వారి సలహా మేరకు అరికట్టవచ్చు.

● స్ప్రేయర్లతో ఎకరాకు 200 లీటర్ల నీరు అవసరమైతే... డ్రోన్‌తో 10 లీటర్లు సరిపోతుంది. సాధారణ విధానంతో పోలిస్తే డ్రోన్‌తో పిచికారీ వల్ల వృథా తగ్గుతుంది.



స్వయం సహాయక సంఘాలు : 30,195
సభ్యులు : 3.02 లక్షలు
డ్రోన్ల ద్వారా ఉపాధి పొందుతున్న స్వయం సహాయక సంఘాలు : 6

**సాగు విస్తీర్ణం (వేల హెక్టార్లు)**

| | | | |
|---|---|---|---|
| వరి: | 2.12 లక్షల ఎకరాలు | మొక్కజొన్న | 11 |
| మిరప | 2 | మినుము | 9 |
| జామ | 657 | చెరకు | 32 |
| | | పొగాకు | 5 |

**ఉపాధికి ఊపిరి..** ఫొటోగ్రఫీ, వ్యవసాయం, నిర్మాణ, రవాణా, విపత్తుల నిర్వహణలో డ్రోన్ల సేవలు విస్తృతమవుతున్న నేపథ్యంలో స్థానిక యువతకు ఉపాధి కల్పనకు సర్కారు ప్రణాళిక రూపొందిస్తోంది. వీటిపై ఆసక్తి ఉన్న నిరుద్యోగులకు, స్వయం సహాయక సంఘాలకు ప్రోత్సహిస్తోంది. ● డ్రోన్ల పంపిణీకి వ్యవసాయ శాఖ అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. డ్రోన్ సామర్థ్యాన్ని బట్టి గరిష్ఠంగా ఒక రోజుకు 75-100 ఎకరాలకు స్ప్రే చేయవచ్చని అధికారులు చెబుతున్నారు. ● రాష్ట్రీయ కృషి వికాస యోజన (ఆర్కేవీవై), సబ్ మిషన్ అగ్రికల్చర్ మెకనైజేషన్ (ఎస్ఎంఏఎం) పథకాల ద్వారా 40 శాతం రాయితీ ఇవ్వనున్నారు. ● స్వయం సహాయక సంఘాల సభ్యుల ఆసక్తి బట్టి డీసీసీబీల ద్వారా రూ.5 లక్షల రుణం ఇప్పించి డ్రోన్ల వినియోగంలో ఉపాధి కల్పించనున్నారు. పది లీటర్ల సామర్థ్యం ఉన్న డ్రోన్ల వ్యయం సుమారు రూ.10 లక్షలు కాగా, కేంద్రం రూ.4 లక్షలు రాయితీ, రూ.5 లక్షలు బ్యాంకులు రుణంగా ఇస్తారు. పది శాతం ఎస్‌హెచ్‌జీలు భరించాలి.

## ఎటు వెళ్తుందో..?

దొరకని చిరుత
ఫలించని అధికారుల వ్యూహాలు


వసంతకాలనీ సమీపంలోని వ్యవసాయ క్షేత్రంలో అధికారుల పరిశీలన, (అంతర చిత్రంలో) చిరుతపులి కాలిగుర్తులు

**భీమడోలు, న్యూస్‌టుడే:** నిఘా కెమెరాలతో చిరుత సంచార ప్రాంతాలను అధికారులు జల్లెడపడుతున్నారు. నిర్దేశిత ప్రాంతాల్లో బోను ఏర్పాటు చేస్తున్నారు. అయినా వారి వ్యూహాలకు చిరుత చిక్కడం లేదు. భీమడోలు శివారు, ద్వారకాతిరుమల మండలం పరిధిలోని ఎం.నాగులపల్లి పరిసర ప్రాంతాల్లో చిరుతపులి సంచారంతో స్థానికులు ఆందోళనకు గురవుతున్నారు. చిరుత ఇక్కడే ఉందా లేదా.. అని తెలియక ప్రజలు గాబరాపడుతున్నారు. ఎంబర్లపేట పంచాయతీ పరిధిలోని వసంతకాలనీ ప్రాంతంలో చిరుతపులి కాలి గుర్తులను మంగళవారం అధికారులు గుర్తించారు. ఇటీవల రాజమహేంద్రవరం ప్రాంతంలో కనిపించిన చిరుతపులి ఇదేనని అధికారులు భావిస్తుండటం గమనార్హం. స్థానికులు అప్రమత్తంగా ఉండాలని రైతులు వ్యవసాయ క్షేత్రాల్లోకి ఒంటరిగా వెళ్లవద్దంటూ అటవీశాఖాధికారులు హెచ్చరికలు చేశారు. డిప్యూటీ డీఎఫ్‌వోలు శ్రీదేవి, దావీదురాజునాయుడు, ఏలూరు రేంజర్ కుమార్, సురేష్‌కుమార్, కుమార్‌సింగ్ తదితరులు బృందాలుగా ఏర్పడి చిరుతను బంధించేందుకు తగిన ఏర్పాట్లు చేస్తున్నారు. "వసంతకాలనీ ప్రాంతంలో చిరుతపులి సంచరించినట్లు స్థానికులు చెప్పటంతో ఆ ప్రాంతాన్ని పరిశీలించాం. చిరుత కాలి గుర్తులు వాస్తవమే." అని అటవీశాఖ రేంజర్ కుమార్ అన్నారు.

## 25న ఉద్యోగ మేళాలు

**ఏలూరు అర్బన్, న్యూస్‌టుడే:** ఏపీ నైపుణ్యాభివృద్ధి సంస్థ, సీడాప్, జిల్లా ఉపాధి కార్యాలయం సంయుక్త ఆధ్వర్యంలో ఈ నెల 25న జంగారెడ్డిగూడెంలోని రామచంద్ర డిగ్రీ కళాశాల, నూజివీడు ప్రభుత్వ ఐటీఐలలో ఉద్యోగ మేళాలు నిర్వహించనున్నట్లు ఏపీ నైపుణ్యాభివృద్ధి సంస్థ జిల్లా ఇన్‌ఛార్జి వి.కిశోర్ ఒక ప్రకటనలో తెలిపారు. 18 నుంచి 30 సంవత్సరాల వయసు కలిగి పదో తరగతి, ఇంటర్, ఐటీఐ,డిగ్రీ, పీజీ తదితర కోర్సులు చదివిన వారు హాజరు కావచ్చన్నారు. మరిన్ని వివరాలకు 91823 42688, 83740 39719 నంబర్లలో సంప్రదించవచ్చని వివరించారు.

## జ్ఞానమూర్తి.. విశ్వకీర్తి

వీణాపాణిగా మలయప్ప స్వామి దర్శనం

**ఆత్రేయపురం, న్యూస్‌టుడే:** కోనసీమ తిరుమల వాడపల్లి వేంకటేశ్వరుని వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా రెండోరోజైన మంగళవారం వీణాపాణిగా, చదువుల తల్లి సరస్వతీ అవతారంలో దర్శనమిచ్చారు. మలయప్ప స్వామి వీణ ధరించి హంస వాహనరూఢుడై వివేకాన్ని భక్తులకు బోధిస్తున్నట్లు కనిపించారు. గోవింద నామస్మరణ నడుమ దేవదేవుడు తిరుమాడ వీధుల్లో విహరిస్తూ జ్ఞానమూర్తిగా ప్రకాశించారు. తొలుత విష్వక్సేన పూజ, పంచామృత మండపారాధన, స్నపనం, అష్టాదశ పాద పద్మారాధన కార్యక్రమాలను పండితులు ఖండవిల్లి రాజేశ్వర వరప్రసాదాచార్యుల నేతృత్వంలో వేదపండితులు, అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహించారు.★ బుధవారం అష్టాదళ శత కలశాభిషేకం, కోదండరామ అలంకరణలో హనుమత్‌వాహన సేవ ఉంటాయి.


స్వామికి అభిషేక క్రతువు నిర్వహిస్తున్న అర్చకులు


శ్రీవారికి అష్టదళ పాదపద్మారాధన


ఆకట్టుకున్న శక్తివేషధారుల ప్రదర్శన

## మద్యం తయారీ కంపెనీల్లో అక్రమాలపై సోదాలు

వంగూరు, చేబ్రోలులో సీఐడీ తనిఖీలు

**ఈనాడు, ఏలూరు, న్యూస్‌టుడే- ఏలూరు నేరవార్తలు, ఉంగుటూరు:** వైకాపా హయాంలో మద్యం విక్రయాల్లో జరిగిన అక్రమాలు, అడ్డగోలు వ్యవహారాల నిగ్గు తేల్చేందుకు రంగం సిద్ధమైంది. మంగళవారం రాష్ట్రవ్యాప్తంగా సీఐడీ బృందాలు మద్యం తయారీ పరిశ్రమలపై ఏకకాలంలో దాడులు చేశాయి.


లారీలో సరకు లోడ్ చేస్తుండగా ఫొటోలు తీస్తున్న స్పెషల్ పార్టీ పోలీసులు

పెదవేగి మండలం వంగూరు పరిధిలోని గౌతమి ఆగ్రో ఇండస్ట్రీ, ఉంగుటూరు మండలం చేబ్రోలులోని సోరింగ్ స్పిరిట్స్ ప్రైవేట్ లిమిటెడ్ లిక్కర్ పరిశ్రమల్లో తనిఖీలు జరిగాయి. వైకాపా పాలనలో మద్యం విక్రయాలు, రవాణా, దస్త్రాల నిర్వహణ తదితర అంశాలపై అధికారులు నిశితంగా పరిశీలించారు.

**నాణ్యతపై ఆరా..** వంగూరు, చేబ్రోలు రెండు చోట్లా విశాఖ, రాజమహేంద్రవరానికి చెందిన అధికారులు, సిబ్బంది కలిసి 50 మంది వరకు సోదాల్లో పాల్గొన్నారు. ఉదయం నుంచి అర్ధరాత్రి వరకు తనిఖీలు కొనసాగాయి. పరిశ్రమల్లో సరకు తయారీ కేంద్రాలు గిడ్డంగులు, ఇతర విభాగాలను తనిఖీ చేశారు. వైకాపా పాలనలో తయారు చేసిన మద్యం బ్రాండ్లలో ప్రమాణాలు పరిశీలించారు. నాసిరకం మద్యం తయారీ జరిగిందా అన్న కోణంలో తనిఖీ చేశారు. సరకు రిజిస్టర్ల నిర్వహణ, ఇతర ఆర్థిక అంశాల గురించి ఆరా తీశారు. గతంలో తయారు చేసిన మద్యంలో స్పిరిట్, ఆల్కహాల్ శాతం తెలుసుకునేందుకు కొంత సరకును స్వాధీనం చేసుకున్నారు. ప్రయోగశాలలో పరీక్షించి నాణ్యత తెలుసుకుంటారు.

**దస్త్రాలన్నీ స్వాధీనం..** వైకాపా పాలనలో జరిగిన మద్యం లావాదేవీలకు సంబంధించిన అన్ని దస్త్రాలను స్వాధీనం చేసుకున్నారు. వీటిని విజయవాడలోని సీఐడీ కార్యాలయానికి తరలించి ఆబ్కారీ శాఖ అధికారులు, నిపుణులతో పరిశీలిస్తారని తెలుస్తోంది. పరిశ్రమల్లో ఎంత మంది విధుల్లో ఉన్నారు. జీతాలు ఎలా ఇస్తున్నారు అనే అంశాలపైనా అడిగి తెలుసుకున్నారు. డిస్టిలరీ వద్ద భద్రత పెంచారు. మంగళవారం లారీల్లో ఎంత సరకు పంపిస్తున్నారో ఫొటోలు తీసి నమోదు చేసుకుంటున్నారు. డిస్టిలరీ మేనేజర్ నాగేశ్వరరావు, ఇతర కీలక సిబ్బందిని తమ వద్దే ఉంచుకుని వివిధ అంశాలకు సంబంధించి వివరాలు సేకరిస్తున్నారు.

మేనేజర్లను, ఇతర కీలక సిబ్బందిని ప్రత్యేకంగా విచారించారు. బుధవారం సైతం తనిఖీలు కొనసాగే అవకాశం ఉంది.

## పైపై పూతలు.. రూ.కోట్లలో లెక్కలు..!

నాసిరకంగా రహదారి మరమ్మతులు


గోతుల దారిలో ప్రయాణికుల ఇక్కట్లు

**తాడేపల్లిగూడెం అర్బన్, న్యూస్‌టుడే:** రహదారి మరమ్మతుల్లో నాణ్యతా ప్రమాణాలు మచ్చుకైనా కానరావడం లేదు. రూ.లక్షలు వెచ్చించి నిర్వహించిన పనులు వారం రోజులకే అధ్వానంగా తయారవుతున్నాయి. తాడేపల్లిగూడెం పట్టణం మీదుగా వెళ్లే ప్రత్తిపాడు-బాదంపూడి రహదారి సుమారు 12 కి.మీ మేర ఉంటుంది. ప్రతిరోజు సుమారు 25 వేలకు పైగా వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. అడుగుకో గుంతతో అతుకుల బొంత తలపించే ఈ మార్గంపై రాకపోకలు సాగించేందుకు ప్రయాణికులకు ఇబ్బందులు తప్పడం లేదు. గత వైకాపా ప్రభుత్వం నూతన రహదారిని నిర్మించకుండా కేవలం మరమ్మతులకే నిధులు కేటాయిస్తూ వచ్చింది. అయిదేళ్ల కాలంలో రూ.1.02 కోట్లతో పలుమార్లు గోతులను పూడ్చారు. అధికారులు, పాలకులు చేతివాటం ప్రదర్శిస్తూ మరమ్మతుల్లో నాణ్యతకు తిలోదకాలిచ్చారు.

**మూణ్నాళ్ల ముచ్చటే..** ఏ మాత్రం నిబంధనలు పాటించకుండా గుత్తేదారులు ఇష్టానుసారంగా పనులు చేపట్టారు. గోతుల్లో పలుచగా తారు పోసి వాటిల్లో రాళ్లు కుమ్మరించారు. వాటిపై క్రషర్ డస్ట్ పోసి రోలర్‌తో చదును చేశారు. రాళ్లు, క్రషర్ డస్టుతో మాత్రమే గోతులు పూడ్చటంలో కొన్ని రోజులకే రహదారి యథాస్థితికి వస్తోంది. ప్రస్తుతం మరమ్మతుల కోసం మరో రూ.90 లక్షలు కేటాయించడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి.


ముత్యాలాంబపురం సమీపంలో భారీ గుంత

## పాఠశాలల నిర్వహణకు నిధులు



**ఈనాడు డిజిటల్, ఏలూరు, తాడేపల్లిగూడెం అర్బన్, న్యూస్‌టుడే:** ఓ వైపు నిధుల్లో కోత... మరో వైపు విడుదలలో జాప్యం వెరసి గత ప్రభుత్వ హయాంలో పాఠశాలలు, కార్యాలయాల నిర్వహణ ఉపాధ్యాయులు, అధికారులకు భారంగా మారింది. నాడు-నేడు ద్వారా రూపురేఖలు మార్చామని చెప్పినా కనీసం నిర్వహణకు అవసరమైన నిధులను రెండేళ్లుగా విడుదల చేయలేదు. విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ బడుల నిర్వహణకు రూ.100 కోట్లు మంజూరు చేయడంపై ఉపాధ్యాయ సంఘాలు హర్షం వ్యక్తం చేస్తున్నాయి.

★ పాఠశాలల నిర్వహణతో పాటు మండల వనరుల కేంద్రం (ఎంఆర్సీ), స్కూలు కాంప్లెక్సుల (సీఆర్సీ)కు నిధులు విడుదల చేయాల్సి ఉన్నా కొరత పేరుతో 2021-22లో 20 శాతం మాత్రమే విడుదల చేసి గత ప్రభుత్వం మమ అనిపించింది. తర్వాత రెండేళ్లు ఎమ్మార్సీ, స్కూలు కాంప్లెక్స్‌లకు నిధులను విడుదల చేయలేదు. చాక్‌పీస్‌లు, రిజిస్టర్ల కొనుగోలు, విద్యుత్తు బిల్లుల చెల్లింపులకు ప్రధానోపాధ్యాయులు జేబుల్లోంచి ఖర్చు చేశారు. తాజాగా కూటమి ప్రభుత్వం పాఠశాలల నిర్వహణకు నిధులు మంజూరు చేస్తున్నట్లు ప్రకటించింది.

**ఉమ్మడి జిల్లాలో ఇదీ పరిస్థితి..** ఉమ్మడి జిల్లాలో 3,179 పాఠశాలలకు సుమారు రూ.7 కోట్లు, 47 ఎంఆర్సీలకు ఒక్కోదానికి రూ.70 వేల చొప్పున, 261 సీఆర్సీలకు ఒక్కో కాంప్లెక్స్‌కు రూ. 21 వేల చొప్పున బకాయిలున్నాయి.

## నీటి సంఘాల ఎన్నికల షెడ్యూల్ విడుదల

**భీమవరం కలెక్టరేట్, న్యూస్‌టుడే:** సాగు నీటి సంఘాల ఎన్నికల కోసం షెడ్యూల్ విడుదలైందని కలెక్టర్ నాగరాణి మంగళవారం తెలిపారు. జిల్లాలో మొత్తం 112 సంఘాలకు నోటిఫికేషన్ విడుదలైందని వివరించారు. ఈ నెల 21న ప్రారంభమైన ప్రక్రియ నవంబరు 29తో ముగుస్తుందని వెల్లడించారు. అక్టోబరు 22 నుంచి 31 వరకు జల వనరులశాఖ అధీకృత అధికారి ద్వారా ప్రాదేశిక నియోజకవర్గాల వారీగా జాబితా సిద్ధం చేస్తారు. 31న జాబితా ప్రకటిస్తారు. నవంబరు 1, 2 తేదీలో అభ్యంతరాలు స్వీకరిస్తారు. నవంరు 3న అదే రోజు నీటి పంపిణీ సంఘాలకు, ప్రాజెక్టు కమిటీ నోటిఫికేషన్ విడుదల చేస్తారు. నవంబరు 6 నుంచి 10 వరకు ఓటర్ల జాబితా తయారు చేస్తారు. 11, 12 తేదీల్లో అభ్యంతరాల స్వీకరించి 13న అభ్యంతరాల పరిష్కరిస్తారు. అదే రోజు తుది జాబితా రూపొందించి, దానిపై వచ్చిన అభ్యంతరాలను 14, 15 తేదీల్లో డివిజనల్ రెవెన్యూ అధికారికి సమర్పిస్తారు. నవంబరు 20న నీటి వినియోగదారుల సంఘాలకు, నీటి పంపిణీ కమిటీలకు, ప్రాజెక్టు కమిటీలకు ఎన్నికల నోటిఫికేషన్ విడుదల చేస్తారు. 21 నుంచి 23 వరకు అన్ని నీటి వినియోగదారుల సంఘాలకు సభ్యులను, అధ్యక్ష, ఉపాధ్యక్షులను ఎన్నుకుంటారు. నవంబరు 24 నుంచి 26 వరకు నీటి పంపిణీ సంఘాలకు, 27 నుంచి 29 వరకు ప్రాజెక్టు కమిటీలకు ఎన్నికలు జరుగుతాయి.

## ఉద్యాన వర్సిటీలో 24, 25 తేదీల్లో కౌన్సెలింగ్

**ఉద్యాన విశ్వవిద్యాలయం, న్యూస్‌టుడే:** వెంకట్రామన్నగూడెం వైఎస్ఆర్ ఉద్యాన విశ్వవిద్యాలయం పరిధిలోని 5 ప్రభుత్వ, 3 ప్రైవేటు ఉద్యాన కళాశాలల్లో బీఎస్సీ (హానర్స్) నాలుగేళ్ల డిగ్రీ కోర్సుల్లో ప్రవేశాలకు ఈ నెల 24, 25 తేదీల్లో వర్సిటీ పరిపాలన భవనంలో కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నట్లు రిజిస్ట్రార్ బి.శ్రీనివాసులు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఏపీఈఏపీ సెట్ ర్యాంకుల ఆధారంగా దరఖాస్తు చేసుకున్న విద్యార్థులు గురు, శుక్రవారాల్లో ఉదయం 9.30 నుంచి సాయంత్రం 5 గంటల మధ్య ధ్రువపత్రాలతో కౌన్సెలింగ్‌కు హాజరుకావాలని సూచించారు. ఇతర వివరాల కోసం అధికారిక వెబ్‌సైట్ http://drysrhu.ap.gov.in ను సంప్రదించాలని తెలిపారు.

## పట్టభద్రుల ఓటుకు 8,164 మంది దరఖాస్తు

**ఈనాడు డిజిటల్, భీమవరం, తాడేపల్లిగూడెం అర్బన్:** ఉభయగోదావరి జిల్లా పరిధిలోని పట్టభద్రుల ఓటరు నమోదు ప్రక్రియకు యంత్రాంగం చర్యలు చేపట్టింది. మార్చి 2025లో జరిగే పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి అర్హులైన వారు నవంబరు ఆరు వరకు ఓటు నమోదు చేసుకునే అవకాశం కల్పించారు. ఫారం-18 ద్వారా దరఖాస్తులు స్వీకరిస్తున్నారు. ఇప్పటికే కూటమి అభ్యర్థిని ప్రకటించగా, ప్రధాన రాజకీయ పార్టీలు, ఉపాధ్యాయ సంఘాల ప్రతినిధులు సైతం పోటీ పడే అవకాశం ఉంది. ఎప్పటికప్పుడు కొత్త జాబితాతోనే ఎమ్మెల్సీ ఎన్నికలు నిర్వహిస్తారు. సోమవారం నాటికి 8,164 మంది దరఖాస్తు చేసుకున్నారు.

**నియోజకవర్గాల వారీగా దరఖాస్తు చేసుకున్నవారు**

| | |
|---|---|
| ఆచంట | 906 |
| పాలకొల్లు | 1197 |
| నరసాపురం | 780 |
| భీమవరం | 1447 |
| ఉండి | 903 |
| తణుకు | 1442 |
| తాడేపల్లిగూడెం | 1489 |



## ఆహా అన్నారు.. భారం మోపారు

● నిలిచిన వాయిదాల చెల్లింపులు ● కొలిక్కిరాని నిధుల లెక్క

☛ నూజివీడులో మైలవరం బస్టాండ్ సమీపాన ఏర్పాటు చేసిన స్టాల్ మూతపడగా తీసుకున్న రూ.13,500లో ఇంకా రూ.13 వేలు బకాయి ఉంది.

☛ నరసాపురం బస్టాండ్ సమీపాన ఏర్పాటు చేసిన క్యాంటీన్‌కు సంబంధించి రూ.10 వేల బకాయి ఉంది.

☛ జంగారెడ్డిగూడెం స్టాల్ నెలలోపే మూతబడింది. రూ.13 వేలు టీఎల్ఎఫ్‌లో జమకాలేదు. తాడేపల్లిగూడెం ప్రభుత్వాసుపత్రి వద్ద స్టాల్‌కు సంబంధించి రూ.3500 బకాయి ఉంది.

**భీమవరం పట్టణం, న్యూస్‌టుడే, పురపాలక బృందం:** వైకాపా పాలనలో పట్టణాల్లో ప్రవేశపెట్టిన ఆహా క్యాంటీన్లు మహిళా సంఘాలను ఆర్థికాభ్యున్నతికి దోహదం చేయకపోగా వారికి భారం మిగిల్చాయి. నెలల వ్యవధిలోనే ఇవి మూతపడటంతో వాయిదాల చెల్లింపులు నిలిచిపోయాయి. నిర్వాహకులకు ఇచ్చిన రుణాలకూ లెక్కల్లేవు.


భీమవరంలో ఆహా క్యాంటీన్ (పాత చిత్రం)

ఉమ్మడి జిల్లాలో ఏలూరు, నూజివీడు, జంగారెడ్డిగూడెం, భీమవరం, తణుకు, తాడేపల్లిగూడెం, పాలకొల్లు, నరసాపురాల్లో మెప్మా సంఘాల సభ్యులతో ఆహా క్యాంటీన్లను ఏర్పాటు చేశారు. ఆదరణ లేకపోవడం, నిర్వహణ లోపాల కారణంగా ఇవన్నీ మూతపడ్డాయి. క్యాంటీన్ ఏర్పాటుకు అవసరమయ్యే తాత్కాలిక స్టాల్ (కియోస్క్) నిమిత్తం నిర్వాహకుల పేరిట తీసుకున్న నగదు పట్టణ సమాఖ్య (టీఎల్ఎఫ్)లో జమకాలేదు. కొన్ని పట్టణాల్లో ఎస్ఎల్ఎఫ్ నిధులకూ లెక్కలు చెప్పకపోవడంపై సభ్యులు ఆందోళన చెందుతున్నారు.

**పద్దులను పరిశీలిస్తాం..** ఆహా క్యాంటీన్ల నిర్వహణ వివరాలు తీసుకుని పద్దులను, టీఎల్ఎఫ్‌లకు నగదు జమ అంశాలను పరిశీలించి తగు చర్యలు తీసుకుంటామని మెప్మా జీవనోపాధుల పర్యవేక్షక అధికారి సీహెచ్ నానిబాబు చెప్పారు.

**సందేహాలెన్నో..** తాత్కాలిక స్టాల్‌కు రూ.13,500 టీఎల్ఎఫ్ నుంచి ఇచ్చారు. ఈ మొత్తాన్ని ప్రతి నెలా రూ.500 చొప్పున తిరిగి చెల్లించాల్సి ఉండగా పూర్తిస్థాయిలో జమ కాలేదు. కొన్ని పట్టణాల్లో ఎస్ఎల్ఎఫ్ నుంచి రుణాలుగా రూ.లక్షలు ఇచ్చినట్లు పద్దులు రాశారు. ఈ సొమ్ములు ఎవరి జేబుల్లోకి వెళ్లాయో తెలియని పరిస్థితి. ప్రతి నెలా పొదుపు చేసి పట్టణ సమాఖ్యలో దాచుకునే నగదును ఇలా దుబారా చేయడంపై సమాఖ్యల సభ్యులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

## సముద్రంలో వేటకు వెళ్లొద్దు

**నరసాపురం, న్యూస్‌టుడే:** బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనంతో ప్రభుత్వం మత్స్యకారులకు హెచ్చరికలు జారీ చేసింది. ఈ నెల 23 నుంచి నాలుగు రోజుల పాటు సముద్రంలో అలలు ఉద్ధృతంగా ఉండనున్న నేపథ్యంలో వేటకు వెళ్లొద్దని అధికారులు సూచించారు. మొగల్తూరు మండలంలో 220 బోట్లపై 678మంది, నరసాపురం మండలంలో 234 బోట్లపై 1122మంది మత్స్యకారులు సముద్రంలోకి చేపలవేటకు వెళ్తుంటారు. మత్స్యకారులు సముద్రంలోకి వేటకు వెళ్లకుండా చూడాలని, ఇప్పటికే వేటకు వెళ్లిన వారిని వెనక్కు రప్పించేలా చూడాలని తహసీల్దార్లను ఆర్డీవో దాసి రాజు ఆదేశించారు. ఆ ప్రక్రియ చేపట్టామని మొగల్తూరు తహసీల్దారు కె.రాజకిశోర్ 'న్యూస్‌టుడే'కు తెలిపారు.

## జాతీయ పురస్కారాలకు దరఖాస్తుల ఆహ్వానం

**భీమవరం పట్టణం, న్యూస్‌టుడే:** మౌలానా అబుల్ కలాం ఆజాద్ జాతీయ పురస్కారాల కోసం దరఖాస్తు చేసుకోవాలని జిల్లా మైనారిటీ సంక్షేమ శాఖ సహాయ సంచాలకుడు ఎస్.ఎస్.కృపావరం మంగళవారం ప్రకటనలో కోరారు. పురస్కారాల కోసం ఉర్దూ సాహితీ వేత్తలు, స్కాలర్లు, కవులు, పాత్రికేయులు, పరిశోధన, ఉపాధ్యాయులు, విద్యార్థులు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. దరఖాస్తు చేసుకున్న వారికి నవంబర్ 11వ తేదీన మౌలానా అబుల్ కలాం జయంతి రోజు అవార్డులు ప్రదానం చేయడం జరుగుతుందన్నారు. దరఖాస్తును విజయవాడ ఉర్దూ అకాడమీకి పంపాలన్నారు.



స్కేటింగ్ పోటీలను ప్రారంభిస్తున్న జిల్లా కార్యదర్శి కె.రమేష్, శిక్షకులు

## బాలబాలికల ఉన్నతికి క్రీడలు దోహదం

**ఏలూరు తూర్పువీధి, న్యూస్‌టుడే:** బాలబాలికల ఉన్నతికి క్రీడలు దోహదపడతాయని ఉమ్మడి జిల్లా స్కేటింగ్ సంఘం కార్యదర్శి కె.రమేష్ అన్నారు. స్థానిక ఇండోర్ మైదానంలో వివిధ విభాగాల్లో జిల్లా రోలర్ స్కేటింగ్ పోటీలను మంగళవారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. పోటీలకు ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 95 మంది హాజరయ్యారు. మొదటి రోజు అండర్-5-1, 2, 3, 4, 5 విభాగాల్లో పోటీలు జరిగాయి. బుధవారం కలపర్రు బైపాస్ రోడ్డులోని రామచంద్ర కళాశాల వద్ద రోలర్ పోటీలు జరుగుతాయని నిర్వాహకులు తెలిపారు. జిల్లా స్థాయిలో ఎంపికైన బాల బాలికలు వచ్చే నెల 6న కాకినాడలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారన్నారు. సంఘం జిల్లా సంయుక్త కార్యదర్శి డి.సురేష్, రాష్ట్ర పరిశీలకుడు రాము, డీఎస్ఏ శిక్షకుడు ఎస్‌కే ఖాసీం, ఉమ్మడి జిల్లాలోని శిక్షకులు తదితరులు పాల్గొన్నారు.










# ఇళ్లల్లో సౌర కాంతులు



### ఎస్సీ, ఎస్టీలకు వందశాతం రాయితీతో పరికరాలు

**ఈనాడు, విశాఖపట్నం:** 'సౌర విద్యుత్తు' వినియోగానికి ముందుకొచ్చేవారికి 'పీఎం సూర్యఘర్ ముఫ్త్ బిజ్లీ' పథకం ద్వారా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రాయితీలిస్తున్నాయి. మూడు కిలోవాట్లకు రూ.78 వేల వరకు ప్రభుత్వం ఆర్థిక సాయం చేస్తుంది. మిగిలిన సొమ్ములు లబ్ధిదారులు భరించాలి. అయితే ఎస్సీ, ఎస్టీ లబ్ధిదారులకు ఉచితంగానే సౌర విద్యుత్తు అందుబాటులోకి తేవాలని కూటమి ప్రభుత్వం భావిస్తోంది. ఈ మేరకు డిస్కంల వారీగా ఆయా వర్గాల లబ్ధిదారులు వివరాలు సేకరిస్తున్నారు. సౌరఫలకలు ఇంటి పైభాగంలో అమర్చాలంటే సుమారు 100 చ.అ. విస్తీర్ణం అవసరం. ఏజెన్సీ ప్రాంతాల్లో కొన్ని చోట్ల ఎస్టీ లబ్ధిదారుల్లో చాలా మంది పూరిళ్లు, పెంకుటిళ్లలోనే నివాసం ఉంటున్నారు. సోలార్ పరికరాలు అమర్చడానికి వీలులేని గృహాలే ఎక్కువ. మైదాన ప్రాంతంలోని ఎస్సీ లబ్ధిదారులున్నా చాలామంది కాలనీల్లో ఉంటున్నారు. ఇంటి పైకప్పులు సోలార్ ఏర్పాటుకు అనువుగాలేవని అధికారులంటున్నారు.

**తూర్పు ప్రాంత విద్యుత్తు పంపిణీ సంస్థ (ఈపీడీసీఎల్) పరిధిలోని అయిదు ఉమ్మడి జిల్లాల్లో 7.22 లక్షల ఎస్సీ, ఎస్టీ గృహ విద్యుత్తు కనెక్షన్లు ఉన్నాయి.**

**ఈపీడీసీఎల్ పరిధిలో ఎస్సీ, ఎస్టీ గృహ విద్యుత్తు కనెక్షన్ల వివరాలు**

| | ఎస్సీ | ఎస్టీ |
|---|---|---|
| ఏలూరు | 1,47,630 | 23,295 |

● ఇప్పటికే ఎస్సీ, ఎస్టీలకు 200 యూనిట్ల లోపు వినియోగించేవారికి ఉచితంగా విద్యుత్తు సరఫరా చేస్తున్నారు. ఈ విద్యుత్తు కొనుగోలు, పంపిణీ ఖర్చు అంతా ప్రభుత్వం భరిస్తుంది. ఒక్కో యూనిట్‌పై సుమారు రూ.6 వరకు వెచ్చిస్తోంది. సోలార్ ద్వారా ఉచితంగా అందించగలిగితే ప్రభుత్వానికి ఆ మేరకు ఆదా అయినట్లే. లబ్ధిదారులు చాలా మంది 100 నుంచి 150 యూనిట్ల మధ్య వినియోగిస్తుంటారు. ఒక కిలోవాట్ సోలార్ ఉపకరణాలతో నెలకు 120 యూనిట్లు సౌరశక్తి ద్వారా అందుబాటులోకి వస్తుంది. మిగతా 30 యూనిట్ల భారమే ప్రభుత్వంపై పడుతుంది.

● 'ఇళ్లలో వినియోగించే విద్యుత్తు కంటే సోలార్ ద్వారా ఎక్కువ విద్యుత్తు ఉత్పత్తి జరిగితే ఆ మిగులును డిస్కంకు తిరిగి అమ్మి సొమ్ము చేసుకోవచ్చు. ఒకసారి సోలార్ ఏర్పాటు చేసుకుంటే 25 ఏళ్ల పాటు నిరంతరాయంగా విద్యుత్తు అందుతుంది. ఎస్సీ, ఎస్టీ లబ్ధిదారుల గుర్తింపు సర్వే పూర్తయింది. ప్రభుత్వ ఆదేశాల మేరకు కార్యాచరణ ఉంటుంది' అని ఈపీడీసీఎల్ సీఎండీ పృథ్వీతేజ్ తెలిపారు.

## పంచారామాలకు ఆర్టీసీ ప్రత్యేక సర్వీసులు

**భీమవరం అర్బన్, న్యూస్‌టుడే:** కార్తిక మాసం సందర్భంగా పంచారామ క్షేత్రాలను దర్శించుకునే భక్తుల సౌకర్యార్థం ఆర్టీసీ ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేస్తున్నట్లు జిల్లా ప్రజా రవాణాధికారి ప్రసాద్ తెలిపారు. భీమవరంలోని ఆయన కార్యాలయంలో మంగళవారం విలేకరుల సమావేశం నిర్వహించి వివరాలు వెల్లడించారు. జిల్లాలోని భీమవరం, నరసాపురం, తణుకు, తాడేపల్లిగూడెం డిపోల నుంచి నవంబరు 3, 10, 17, 24 తేదీల్లో బస్సు సర్వీసులు ఏర్పాటు చేశామన్నారు. ఆయా తేదీల్లో ఆదివారం రాత్రి జిల్లా నుంచి బయలుదేరి సోమవారం రాత్రి తిరిగి వస్తాయన్నారు. అయ్యప్ప మాలధారుల కోరిక మేరకు శబరిమల యాత్రాదర్శిని కూడా ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. జిల్లాలోని నాలుగు డిపోల నుంచి ఒకే ధరలో బస్సులు ఏర్పాటు చేస్తున్నట్లు వివరించారు. శ్రీశైలం యాత్రకు ప్రత్యేక బస్సులు అందుబాటులో ఉంటాయన్నారు. నవంబరు మొదటి వారంలో నరసాపురం నుంచి మార్టేరు, తణుకు మీదుగా కర్ణాటకలోని రాయచూర్‌కు ఆర్టీసీ సర్వీసు ప్రారంభించనున్నట్లు వెల్లడించారు. సమావేశంలో సంస్థ పీవో గీతావాణి, భీమవరం, నరసాపురం, తణుకు డీఎంలు సత్యనారాయణమూర్తి, సుబ్బన్నరెడ్డి, గిరిధర్‌కుమార్, తాడేపల్లిగూడెం సహాయ మేనేజర్ సుధారాణి, పీఆర్వో రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.



గోడపత్రాన్ని ఆవిష్కరిస్తున్న జిల్లా ప్రజా రవాణాధికారి ప్రసాద్ తదితరులు

## 'కల్లు అమ్మకాలు దెబ్బతీయాలని చూస్తే ఊరుకోం'

**భీమవరం వన్‌టౌన్, న్యూస్‌టుడే:** మద్యం ఆదాయం కోసం పరోక్షంగా బెల్టు దుకాణాలు ప్రోత్సహించి కల్లు అమ్మకాలు దెబ్బతీయాలని కూటమి ప్రభుత్వం అనుకుంటే గీత కార్మికులు చూస్తూ ఊరుకోరని ఏపీ కల్లుగీత కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జుత్తిగ నరసింహమూర్తి హెచ్చరించారు. భీమవరం సీఐటీయూ కార్యాలయంలో మంగళవారం కల్లుగీత కార్మిక సంఘం నాయకుడు కడలి పాండు అధ్యక్షతన జిల్లా కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధాన కార్యదర్శి నరసింహమూర్తి మాట్లాడుతూ రసాయనాలతో తయారైన బీరు, బ్రాందీ, విస్కీలకు ఇస్తున్న ప్రాధాన్యం ప్రకృతి సహజ సిద్ధమైన తాటి కల్లుకు ఇవ్వకపోవడం బాధాకరమన్నారు. కల్లు గీత కార్మికుల సంక్షేమం కోసం కొత్త పాలసీని తీసుకురావాలన్నారు. సమావేశంలో జిల్లా నాయకుడు బి. చంటి, దాసరి సూరిబాబు, శ్రీనివాస్, రంగారావు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న నరసింహమూర్తి

## వెబ్‌సైట్‌లో మెరిట్ జాబితా

**ఏలూరు విద్యా విభాగం, న్యూస్‌టుడే:** జిల్లాలోని కేజీబీవీల్లో ఖాళీగా ఉన్న బోధనేతర సిబ్బంది కొలువుల భర్తీకి దరఖాస్తు చేసుకున్న అభ్యర్థుల మెరిట్ జాబితాను www.deoeluru.org వెబ్‌సైట్‌లో పొందుపరిచినట్లు డీఈవో ఎస్.అబ్రహం ఒక ప్రకటనలో తెలిపారు. అభ్యంతరాలుంటే సమగ్ర శిక్షా జిల్లా కార్యాలయంలో అందజేయాలన్నారు.

# అన్నదాతలకు మేలు చేకూర్చేలా సంస్కరణలు

**ఉంగుటూరు, న్యూస్‌టుడే:** వైకాపా ప్రభుత్వం వ్యవసాయ రంగాన్ని నిర్లక్ష్యం చేసిందని, అన్నదాతలకు మేలు చేకూర్చేలా ఎన్డీయే ప్రభుత్వం సంస్కరణలు తీసుకొస్తోందని పౌరసరఫరాల శాఖ, జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి నాదెండ్ల మనోహర్ అన్నారు. చేబ్రోలు రైతు సేవా కేంద్రంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని మంగళవారం ఆయన ప్రారంభించారు. అనంతరం ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు అధ్యక్షత వహించిన సభలో మంత్రి మాట్లాడుతూ రైతులు సూచించిన మిల్లుకే ధాన్యాన్ని తరలించే వెసులుబాటు కల్పించామని తెలిపారు. వైకాపా హయాంలో నిర్మించిన రూ.3,300 కోట్లతో నిర్మించిన ఆర్బీకేలతో రైతులకు ఒరిగిందేమీ లేదన్నారు. గత ప్రభుత్వం మిల్లర్లకు సైతం రూ.976 కోట్ల బకాయిలు చెల్లించలేదన్నారు. తొలుత ఏపీ సాధికారిక సంస్థ, ఉద్యాన శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన స్టాళ్లను మనోహర్ పరిశీలించారు. సంయుక్త కలెక్టర్ ధాత్రి రెడ్డి, దెందులూరు, తాడేపల్లిగూడెం ఎమ్మెల్యేలు చింతమనేని ప్రభాకర్, బొలిశెట్టి శ్రీనివాస్, జడ్పీ ఛైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ, తెదేపా, భాజపా జిల్లా అధ్యక్షుడు గన్ని వీరాంజనేయులు, విక్రం కిశోర్, జనసేన ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు కొటికలపూడి గోవిందరావు, కూటమి నాయకులు పాల్గొన్నారు.



సత్యేంద్ర కుటుంబాన్ని పరామర్శిస్తున్న మంత్రి నాదెండ్ల, ఎమ్మెల్యే బొలిశెట్టి

### సేవాభావం జనసేన సిద్ధాంతం

**తాడేపల్లిగూడెం అర్బన్, న్యూస్‌టుడే:** సేవాభావం సిద్ధాంతాలు జనసేన సొంతమని మంత్రి నాదెండ్ల మనోహర్ అన్నారు. తాడేపల్లిగూడెం మండలం పెదతాడేపల్లి, అప్పారావుపేట గ్రామాల్లో ఇటీవల మృతి చెందిన తెలుగుదేశం, జనసేన కార్యకర్తల కుటుంబాలను ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్‌తో కలిసి మంగళవారం పరామర్శించారు. ఈ సందర్భంగా పెదతాడేపల్లికి చెందిన జనసేన నాయకుడు సత్యేంద్ర కుటుంబానికి రూ.5 లక్షలు, అప్పారావుపేట పార్టీ కార్యకర్తకు రూ.1.30 లక్షల ఆర్థిక సహాయం అందించారు. అనంతరం మనోహర్ మాట్లాడుతూ సేవాభావ స్ఫూర్తితో ఏర్పడిన జనసేన సిద్ధాంతాలను ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ ముందుకు తీసుకెళ్లడం హర్షణీయమన్నారు. కార్యక్రమంలో నాయకులు పరిమి రవికుమార్, బొలిశెట్టి రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

## మూడంతస్తుల మునగ చెట్టు!



ఇంటి ఆవరణలోని పెంచిన మునగచెట్టు ఏకంగా మూడంతస్తుల భవనం ఎత్తుకు ఎదిగి అబ్బురపరుస్తోంది. దీనిని రెండేళ్ల క్రితం నాటామని కిందికి వాలకుండా ఉండేందుకు భవనానికి తాళ్లతో కట్టామని అందుకే 36 అడుగుల వరకు పెరిగిందని చెబుతున్నారు పాలకొల్లుకు చెందిన షేక్ చాంద్‌బీబీ. ఏటా బాగానే కాయలు కాస్తోందని ప్రస్తుతం పూతదశలో ఉందన్నారు. ఈ మార్గంలో వెళ్లేవారంతా ఆసక్తిగా వీక్షిస్తున్నారు. దీనిపై తణుకు ప్రాంతీయ ఉద్యానాధికారి ప్రియదర్శిని మాట్లాడుతూ నేలస్వభావం, మొక్కకు అందిన పోషకాలు, సంరక్షణ కారణంగా ఇలా అరుదుగా ఎత్తు పెరుగుతాయన్నారు.

-ఈనాడు, పాలకొల్లు.

# విద్యార్థిని తీర్చిదిద్దే గురుతర బాధ్యత ఉపాధ్యాయులదే

### నన్నయ ఉప కులపతి ఆచార్య శ్రీనివాసరావు

**భీమవరం పట్టణం, న్యూస్‌టుడే:** విద్యార్థులకు ఉత్తమ భవిష్యత్తు అందించే బాధ్యత గురువులపై ఉందని నన్నయ విశ్వ విద్యాలయ ఉప కులపతి ఆచార్య వై.శ్రీనివాసరావు అన్నారు. భీమవరంలోని డాక్టర్ సీఎస్ఎన్ కళాశాలలో మార్గదర్శన్ స్కీమ్ పేరిట నిర్వహించిన కార్యశాలలో ఆయన పాల్గొన్నారు. ప్రతి విద్యార్థి భవిష్యత్తుకు బాటలు వేసేది ఉపాధ్యాయులేనని అన్నారు. సాంకేతికత ఎంతో చేరువైందని, గతంతో పోల్చితే అన్ని విషయాలు క్షణాల్లో అర చేతిలో చూసేలా సాంకేతికత అందుబాటులోకి వచ్చిందని కళాశాల కరస్పాండెంట్ డాక్టర్ చీడే సత్యనారాయణ అన్నారు. ప్రతి విషయంపై విద్యార్థికి పట్టు ఉండాలన్నారు. మార్గదర్శన్ స్కీమ్ సభ్యుడు వెంకటేశ్వరరావు మాట్లాడుతూ భీమవరంలోని సీఎస్ఎన్, విష్ణు, డీఎన్నార్, పెనుగొండ కె.ఎస్.రాజు కళాశాలలు మార్గదర్శన్ స్కీమ్‌లో ఉన్నాయన్నారు. కళాశాల ప్రధానాచార్యుడు సకుమళ్ల సత్యనారాయణ, కోశాధికారి వడుపు గోపి, డీఎన్నార్ ప్రధానాచార్యుడు మోజెస్, అప్పారావు, బి.ప్రభాకర్, జి.భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.



కత్తియుద్ధం పోటీలు ప్రారంభిస్తున్న శ్రీనివాసరావు

**పోటీలు ప్రారంభం..**

క్రీడలు, సంస్కృతి, కళలతో పాటు పాఠ్యాంశాల్లో తమ సామర్థ్యాన్ని మెరుగు పరచుకోవాలని నన్నయ విశ్వవిద్యాలయ ఉప కులపతి ఆచార్య వై.శ్రీనివాసరావు అన్నారు. భీమవరంలోని డాక్టర్ సీఎస్ఎన్ కళాశాల ఆవరణలో విశ్వవిద్యాలయ స్థాయి కత్తి యుద్ధం పోటీలను ఆయన మంగళవారం ప్రారంభించారు. పోటీతత్వం ఉండాలని, ఓటమి నుంచి విజయం ఎలా సాధించాలో తెలుసుకునేలా క్రీడాసక్తి ఉండాలని సూచించారు.

## టీపీబీవోకు మోమో జారీ

**తణుకు గ్రామీణం, న్యూస్‌టుడే:** తణుకు మున్సిపాలిటీలో అయిదేళ్లుగా పట్టణ ప్రణాళిక విభాగంలో విధులు నిర్వహిస్తున్న హేమలతతోపాటు 21వ వార్డు సచివాలయం కార్యదర్శి మణికంఠకు కమిషనర్ రామ్‌కుమార్ మోమో జారీ చేశారు. పట్టణంలో నిబంధనలకు విరుద్ధంగా భవనాలు నిర్మిస్తున్నా... హేమలత పట్టించుకున్న దాఖలాలు లేవు. అక్రమ నిర్మాణదారుల నుంచి లంచాలు తీసుకుంటున్నారన్న అభియోగాలు ఈమెపై ఉన్నాయి. ఈ నేపథ్యంలో కమిషనర్ ఆమెకు మోమో జారీ చేశారు.

# రుణదాతల వేధింపులకు బలి!

### అపహరించి తరలిస్తుండగా తెదేపా ఎంపీటీసీ సభ్యుడి మృతి

**గంగాధరనెల్లూరు, న్యూస్‌టుడే:** ప్రైవేటు రుణదాతలు, ఫైనాన్స్ సంసల వేధింపులకు తెదేపా నేత బలయ్యారు. చిత్తూరు జిల్లా పాలసముద్రం మండలం నరసింహాపురానికి చెందిన తెదేపా ఎంపీటీసీ సభ్యుడు జగన్నాథరాజు(51) అనుమానాస్పద స్థితిలో మృతిచెందారు. సోమవారం రాత్రి చిత్తూరు నుంచి పాలసముద్రంకు ద్విచక్రవాహనంపై వెళుతుండగా గంగాధరనెల్లూరు మండల సరిహద్దులో ఏలూరు జిల్లా నూజివీడుకు చెందిన జేసీబీ యంత్రాల ఫైనాన్స్ సంస్థకు చెందిన పది మంది రెండు కార్లలో వచ్చి జగన్నాథరాజును కిడ్నాప్ చేశారు. నూజివీడు సమీపంలో వెళ్తుండగా గుండెపోటుతో అతను మృతిచెందినట్లు కిడ్నాపర్లు కుటుంబీకులకు ఫోన్‌లో చెప్పారు. మృతుని కుటుంబీకుల ఫిర్యాదు మేరకు నూజివీడుకు చెందిన వీరేశ్, శివ, మణి, చంద్ర, నాగరాజుతోపాటు మరో ఐదుగురిపై కిడ్నాప్ కేసు నమోదు చేసినట్లు జీడీనెల్లూరు సీఐ లక్ష్మీనారాయణ తెలిపారు.



జగన్నాథరాజు (పాతచిత్రం)

## కాలువలో గల్లంతైన వ్యక్తి మృతి

**పాలకోడేరు, న్యూస్‌టుడే:** గరగపర్రు శివారు చౌరాయిగూడెం కాలువలో దూకి ఆత్మహత్యకు పాల్పడిన వేంద్ర బాలాజీ(28) మృతదేహం మంగళవారం గుర్తించినట్లు పాలకోడేరు ఎస్సై ఎన్.హరిబాబు తెలిపారు. అత్తిలి శివారు బొంతువారిపాలేనికి చెందిన వేంద్ర బాలాజీకి రెండున్నరేళ్ల కిందట వివాహమైంది. గరగపర్రు శివారు ఉప్పరిగూడెంలో అత్తవారి ఇంటి వద్ద ఉంటున్నాడు. భార్యతో గొడవ పడి మనస్తాపానికి గురై సోమవారం రాత్రి పురుగుల మందు తాగి చౌరాయిగూడెం కాలువలో దూకి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. అంతకు ముందు తాను ఆత్మహత్య చేసుకుంటున్నట్లు తన అన్నయ్యకు చరవాణిలో సమాచారం ఇచ్చాడు. ఉప్పరిగూడెం రామాలయం వద్ద ఆత్మహత్య ఉత్తరం రాసి పెట్టినట్లు తెలిపారు. దీంతో బంధువులు కాలువలో రాత్రంతా గాలించినా ఆచూకీ లభించలేదు. మంగళవారం ఉదయం మహదేవపట్నం కాలువలో మృతదేహం లభించినట్లు ఎస్సై తెలిపారు. ఈయనకు ఐదు నెలల పాప ఉంది. కేసు నమోదు చేసి పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని భీమవరం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు ఎస్సై హరిబాబు తెలిపారు.

# శాస్త్రవేత్తల బృందం పరిశీలన

**మార్టేరు, న్యూస్‌టుడే:** మార్టేరులోని ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానాన్ని కేంద్ర విత్తన పరిశీలన బృందం మంగళవారం సందర్శించింది. భారత వ్యవసాయ పరిశోధన మండలి (విత్తన అభివృద్ధి శాస్త్రం) ప్రధాన శాస్త్రవేత్తలు సందీప్‌కుమార్ లాల్, అశ్వినీకుమార్, సీనియర్ శాస్త్రవేత్తలు భోజరాజ నాయక్, అసిస్టెంట్ ప్రొఫెసర్ ప్రతాప్‌భాన్‌సింగ్, శాస్త్రవేత్త బనోత్‌వినేష్‌తో కూడిన బృందం క్షేత్రస్థాయి సందర్శన చేశారు. పరిశోధన కేంద్రంలోని మూల విత్తనోత్పత్తి క్షేత్రాలు, విత్తన గిడ్డంగి, విత్తనశుద్ధి కేంద్రాలను సందర్శించి సూచనలు, సలహాలు ఇచ్చారు. స్థానిక పరిశోధన కేంద్రంలో జరుగుతున్న పరిశోధన, విత్తనోత్పత్తి గురించి ఆరా తీశారు. వీరి వెంట ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం విత్తన సంచాలకులు వై.సతీష్, ప్రధాన శాస్త్రవేత్త కృష్ణానాయక్, ఏడీఆర్ టి.శ్రీనివాస్, వరి ప్రధాన శాస్త్రవేత్త ఎం.గిరిజారాణి, శాస్త్రవేత్తలు పాల్గొన్నారు.



క్షేత్రస్థాయి సందర్శనలో కేంద్ర విత్తన పరిశీలన బృందం శాస్త్రవేత్తలు

## ఎస్.ఇల్లిందలపర్రు లాకు పరికరాలు మాయం

**పెనుమంట్ర, న్యూస్‌టుడే:** సోమరాజు ఇల్లిందలపర్రు లాకు పరికరాలు మాయమైన ఘటన ఆలస్యంగా బయటకొచ్చింది. పూర్వం లాకుల వద్ద లాంచీలు వెళ్లేందుకు ప్రత్యేక మార్గాన్ని ఏర్పాటు చేశారు. ఇందులో పెద్దగా వినియోగించని లాకు తలుపుల వద్ద భారీ బరువుతో కూడిన ఇనుప గడ్డర్లు, గేరుబాక్స్‌లను తొలగించి చోరీకి పాల్పడ్డారు. ఆగస్టు, సెప్టెంబర్ నెలల్లో రెండు దఫాలుగా ఈ దొంగతనాలు జరిగినట్లు తెలుస్తోంది. పొక్లెయిన్ సాయంతో వాహనంలో తీసుకెళ్తే గానీ వీటిని తరలించే అవకాశం ఉండని పరిస్థితుల్లో చోరీ వ్యవహారంపై పలు అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. ఈ వ్యవహారంపై లాకు సిబ్బంది పోలీసులకు ఫిర్యాదు చేసి మిన్నకుండి పోవడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

## తల్లీకూతుర్ల అదృశ్యంపై కేసు

**తణుకు గ్రామీణం, న్యూస్‌టుడే:** భర్తతో మనస్పర్థల కారణంగా భార్య తన ఇద్దరు కుమార్తెలతో ఇంటి నుంచి బయటకెళ్లిపోయిన ఘటన వేల్పూరులో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. తణుకు మండలం వేల్పూరు గ్రామానికి చెందిన నల్లి నగేష్‌కు 11 సంవత్సరాల కిందట ఝాన్సీలక్ష్మి అనే మహిళతో వివాహమైంది. వీరికి ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. భార్యాభర్తల మధ్య మనస్పర్థలు రావడంతో గత నెల 29న ఝాన్సీలక్ష్మి తన ఇద్దరు పిల్లలను తీసుకుని ఇంటి నుంచి వెళ్లిపోయింది. ఆమె కోసం బంధువులు గాలించినా ఆచూకీ దొరకలేదు. భర్త నల్లి నగేష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు అదృశ్యం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ఏజీఎస్ మూర్తి తెలిపారు.

## ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు ఉచిత శిక్షణ

**ఏలూరు గ్రామీణ, న్యూస్‌టుడే:** డీఎస్సీ పరీక్షకు హాజరయ్యే ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు సాంఘిక సంక్షేమ శాఖ జేడీ వి.జయప్రకాష్ ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు అభ్యర్థులకు వసతితో కూడిన శిక్షణ ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. టెట్ అర్హత కలిగి ఉండి, వార్షిక ఆదాయం రూ.2.50 లక్షలలోపు ఉండాలన్నారు. అర్హత, ఆసక్తి ఉన్నవారు ఈ నెల 25వ తేదీలోగా జ్ఞానభూమి వెబ్‌సైట్‌లో దరఖాస్తులు చేసుకోవాలన్నారు. దరఖాస్తు చేసుకునే అభ్యర్థులకు ఈ నెల 27న స్క్రీనింగ్ పరీక్ష నిర్వహిస్తామని తెలిపారు.

**బ్రాయిలర్ ధరలు (కృష్ణాజిల్లా)**
(కిలో 1 కి రూ.ల్లో)

వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర -135 రిటైల్ ధర 157 చికెన్ విత్ స్కిన్ - 228, చికెన్ స్కిన్‌లెస్ - 259. అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర - 138, 147, 158 చికెన్ విత్ స్కిన్ - 266 చికెన్ స్కిన్‌లెస్ - 276.

# అంతర్‌జిల్లా దొంగల అరెస్టు

**ఆలమూరు, న్యూస్‌టుడే:** ఆలమూరు మండలం జొన్నాడలో ఇటీవల జరిగిన చోరీకి సంబంధించి ఇద్దరు అంతర్‌జిల్లా దొంగలను రావులపాలెం రూరల్ సీఐ సీహెచ్ విద్యాసాగర్ అరెస్టు చేశారు. వారినుంచి 121 గ్రాముల బంగారు వస్తువులను రికవరీ చేశారు. మంగళవారం ఆలమూరు పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఎస్సై అశోక్‌తో కలిసి వివరాలు వెల్లడించారు. జొన్నాడకు చెందిన చిటికెన సోమరాజు తన భార్య సీత ఆరోగ్యం క్షీణించడంతో పెద్ద కుమార్తె ఇంటివద్ద హైదరాబాద్‌లోనే నెల రోజులుగా ఉంటున్నారు. ఈ నెల 15న ఒక వేడుక నిమిత్తం బొబ్బర్లంక వచ్చిన సోమరాజు చిన్న అల్లుడు జానా మారుతీశివరామ్ జొన్నాడ వచ్చి కొన్ని బంగారు వస్తువులు తీసుకుని ఇంటికి తాళం వేసి వెళ్లారు. 17న పనిమనిషి వచ్చి ఇంటి పరిసరాలు శుభ్రం చేసేందుకు ఉపక్రమిస్తున్న సమయంలో ప్రధానద్వారం తెరిచి ఉండటంతో యజమానికి ఫోన్‌లో విషయం తెలియజేసింది. దీనిపై మారుతీశివరామ్ పోలీసులకు ఫిర్యాదు చేయగా విచారణ చేపట్టారు. భీమవరానికి చెందిన పందిరి వెంకటనారాయణ అలియాస్ నారిగాడు, నెల్లూరుకు చెందిన షేక్ అహ్మద్ బాషాలను నిందితులుగా గుర్తించి అరెస్టు చేశారు. వీరిద్దరూ రాత్రి సమయాల్లో తాళంవేసి ఉన్న ఇళ్లల్లో దొంగతనాలు చేయడంలో సిద్ధహస్తులు. నారిగాడిపై 60 చోరీ కేసులు ఉన్నాయి. ఇతనికి 2019లో అహ్మద్‌బాషా జైలులో పరిచయమయ్యాడు. అప్పటి నుంచి ఇద్దరూ కలిసి దొంగతనాలు చేస్తున్నారు. ఈ కేసు ఛేదించడంతో కృషి చేసిన ఎస్సై అశోక్ బృందాన్ని సీఐ ప్రశంసించారు.



రికవరీ చేసిన బంగారు ఆభరణాలు





**నెక్ సూచించిన కోడిగ్రుడ్ల ధర**

★ For the Information of Trade & Industry
★ గోదావరి జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గ్రుడ్డు ధర రూ. 5.30 పైౖ
తణుకు ఆఫీసు: 08819-224254

# భీమవరం



## అమ్మవారికి ప్రత్యేక పుష్పాలంకరణ



**పాలకోడేరు, న్యూస్‌టుడే:** దసరా మహోత్సవాలు ముగింపు సందర్భంగా పాలకోడేరు శివారు కొత్తపేట కనకదుర్గమ్మ ఆలయంలో మంగళవారం భారీ అన్న సమారాధన నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పుష్పాలంకరణ నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని అమ్మవారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

## అనధికారిక కట్టడాలపై చర్యలు



సూచనలిస్తున్న కమిషనర్ రామచంద్రారెడ్డి

**భీమవరం పట్టణం, న్యూస్‌టుడే:** కాలువలపై అక్రమ నిర్మాణాలతో పారిశుద్ధ్య నిర్వహణ ఇబ్బందిగా ఉందని కమిషనర్ కె. రామచంద్రారెడ్డి అన్నారు. 12వ వార్డులో ఆయన మంగళవారం పరిశీలించారు. డ్రెయిన్లను కప్పేస్తూ శాశ్వత నిర్మాణాలు చేయడంతో మురుగు రహదారిపై చేరుతుండటంతో, దాంతో ప్రయాణికులకు ఇబ్బందిగా ఉంటున్నారు. ఇలాంటి నిర్మాణాలపై చర్యలు తీసుకుంటామన్నారు. తడి, పొడి చెత్త సేకరణపై సచివాలయ సిబ్బంది పర్యవేక్షణ ఉండాలని ఆదేశించారు.

## అభయాంజనేయ స్వామికి విశేష పూజలు

**భీమవరం ఆధ్యాత్మికం, న్యూస్‌టుడే:** ఆశ్వయుజ మాసం మంగళవారం సందర్భంగా పట్టణంలో పలు ఆంజనేయ స్వామి ఆలయాల్లో విశేష పూజలు నిర్వహించారు. సుంకర పద్దయ్య వీధిలో ఉన్న అభయాంజనేయ స్వామి ఆలయం కూడలిలో విశేష పూజలు, ఉత్సవమూర్తికి అభిషేకాలు, సహస్ర నామ పూజలు చేశారు. ★ కొత్తబస్టాండ్ సమీపంలో దాసాంజనేయ స్వామికి ఉదయం పంచామృతాలతో అభిషేకం, సాయంత్రం వివిధ రకాల పుష్పాలతో అలంకరణ, సింధూరార్చన చేసినట్లు ఆలయ ఈవో జీవీఎస్ రామరాజు తెలిపారు.

## ఆహ్లాదం.. ఆనందం

### పట్టణ సుందరీకరణకు శ్రీకారం

**భీమవరం పట్టణం, న్యూస్‌టుడే:** పశ్చిమగోదావరి జిల్లా కేంద్రమైన భీమవరాన్ని సుందరంగా తీర్చిదిద్దనున్నారు. పార్కుల్లో వాకింగ్ ట్రాక్‌లు ఏర్పాటు చేయడంతో పాటు ఆహ్లాదకర వాతావరణం కల్పించేందుకు చర్యలు చేపట్టారు. కలెక్టర్ చదలవాడ నాగరాణి, సంయుక్త కలెక్టర్ టి.రాహుల్ కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో పట్టణంలోని పార్కులు అభివృద్ధికి ప్రణాళిక తయారు చేశారు. పనులు వేగవంతం చేసేలా రూపకల్పనలో పురపాలక కమిషనర్ కె.రామచంద్రారెడ్డి, అధికారులు నిమగ్నమయ్యారు.



బోటు షికారు అభివృద్ధి చేయనున్న ఎడ్వర్డ్ చెరువు

**// పార్కులు**

పట్టణంలోని 11 పార్కు స్థలాలను ఎంపిక చేశారు. మారుతీనగర్, హౌసింగ్ బోర్డు కాలనీ, ఆదర్శనగర్, వంశీకృష్ణా నగర్, నర్సయ్య అగ్రహారం తదితర ప్రాంతాల్లోని పార్కు స్థలాలకు గత కొన్నేళ్ల క్రితం రక్షణ గోడలు నిర్మించారు. వాటిని నిరుపయోగంగా వదిలేయడంతో అధునాతన భవనాల మధ్యన చిట్టడవిలా తయారైంది. వాటన్నింటిని శుభ్రం చేసి ఆహ్లాదకర పార్కులుగా అభివృద్ధి చేస్తారు. వాటర్ స్పోర్ట్స్, అడ్వంచర్స్ స్పోర్ట్స్ కూడా ఏర్పాటు చేయనున్నారు. పిల్లలు, యువత, పెద్దవాళ్ల పార్కులను వినియోగించుకునేలా తీర్చిదిద్దుతారు.

**బోటింగ్ ఏర్పాట్లు**

21వ వార్డులోని ఎడ్వర్డ్ ట్యాంక్ పార్కులో బోటింగ్ ఏర్పాటుకు ప్రణాళిక తయారు చేశారు. ఈ పార్కును రోటరీ క్లబ్, ఎన్ఆర్ఐ జె.సంజయ్ సౌజన్యంతో రూ. 55 లక్షల వ్యయం చేసి అభివృద్ధి చేస్తున్నారు. రోటరీ, జూపూడి సూర్యకృష్ణ పార్కు, ఎడ్వర్డ్ ట్యాంకులను ఆధునికీకరించే పనులు చేస్తున్నారు. ప్రభుత్వాసుపత్రికి ఎదురుగా ఉన్న ఈ ప్రాంతంలో బోటు షికారు అభివృద్ధితో ఈ ప్రాంతం మరింత శోభ సంతరించుకోనుంది.

## రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక



లాంగ్‌జంప్‌లో విద్యార్థిని గాయత్రి

**సిద్ధాపురం(ఆకివీడు), న్యూస్‌టుడే:** స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (ఎస్‌జీఎఫ్ఐ) ఆధ్వర్యంలో మంగళవారం ఏలూరు జిల్లా దెందులూరు మండలం గోపన్నపాలెంలోని కళాశాల క్రీడా మైదానంలో జిల్లా స్థాయి అథ్లెటిక్స్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీలలో ఆకివీడు మండలం సిద్ధాపురం ఉన్నత పాఠశాలలో చదువుతున్న కె. గాయత్రి(9వ తరగతి) అండర్-14 లాంగ్ జంప్ విభాగంలో రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్లు వ్యాయామ ఉపాధ్యాయుడు జి. మోహన్ తెలిపారు. ఈ సందర్భంగా క్రీడా పోటీలలో ప్రతిభ కనబరిచిన విద్యార్థినిని, వ్యాయామ ఉపాధ్యాయుడిని ప్రధానోపాధ్యాయుడు ఎం.ఉమామహేశ్వరం, పాఠశాల అభివృద్ధి కమిటీ ఛైర్మన్ భూపతిరాజు తిమ్మరాజు, ఎస్ఎంసీ ఛైర్మన్ రఫీ అభినందించారు.

## విద్యార్థుల సృజనకు పదును

### 'ఈనాడు' ఆధ్వర్యంలో ప్రతిభా పాటవ పోటీలు



బహుమతులు అందుకున్న ఆదిత్య ఆంగ్ల మాధ్యమ పాఠశాల విద్యార్థినులతో ప్రిన్సిపాల్ టి.శ్రీనివాస్, యుగ సుధ తదితరులు



బహుమతులు అందుకున్న వండర్ కిడ్స్ ఆంగ్ల మాధ్యమ పాఠశాల విద్యార్థులతో ప్రధానోపాధ్యాయురాలు వనజాక్షి, వాణి

**భీమవరం పట్టణం, న్యూస్‌టుడే:** 'ఈనాడు' ప్రతిభా పాటవ పోటీలు భీమవరంలోని ఆదిత్య ఆంగ్ల మాధ్యమ పాఠశాల, వండర్ కిడ్స్ ఆంగ్ల మాధ్యమ పాఠశాలల్లో మంగళవారం నిర్వహించారు. విద్యార్థుల్లో ఉన్న సృజనకు పదును పెట్టేలా ఇలాంటి పోటీలు దోహదపడతాయని వ్యాస రచనలో పాల్గొన్న విద్యార్థులు అన్నారు. పత్రికలు చదవడం వల్ల ప్రపంచ జ్ఞానం పెంపొందుతుందని ఉపాధ్యాయులు సూచించారు. 'అంతర్జాలం వినియోగంతో లాభ నష్టాలు, విద్యార్థులపై సామాజిక మాధ్యమాల ప్రభావం'పై నిర్వహించిన వ్యాస రచనలో 8, 9, 10 తరగతి విద్యార్థులు పోటీ పడ్డారు. ★ ఆదిత్య ఆంగ్ల మాధ్యమ పాఠశాలలో డైరెక్టర్ ఎన్.వి.పి.కె.హెచ్.జి కృష్ణంరాజు ఆధ్వర్యంలో ప్రిన్సిపాల్ టి.శ్రీనివాస్, బి.వై. యుగ సుధ బహుమతులు అందజేశారు. తొమ్మిదో తరగతి విద్యార్థినులు కె.రిషిత, ఎండీ మెహక్ సుల్తానా, ఎ.శరణ్య నాగదేవి వరుసగా ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచారు. ★ వండర్ కిడ్స్ ఆంగ్ల మాధ్యమ పాఠశాలలో తొమ్మిదో తరగతి విద్యార్థులు ఎం.నవదీప్, కె.హారిక ప్రథమ, ద్వితీయ స్థానాలు, 8వ తరగతి విద్యార్థి సీహెచ్ చార్విశ్రీ తృతీయ స్థానంలో నిలిచారు. బహుమతులను పాఠశాల ఛైర్మన్ అల్లు రామకృష్ణ, డైరెక్టర్ ఎ.వంశీకృష్ణ ఆధ్వర్యంలో ప్రధానోపాధ్యాయులు అల్లు వనజాక్షి, టి.వాణి అందజేశారు.

## పంట కాలువ పనులు చేపట్టండి

**పాలకోడేరు, న్యూస్‌టుడే:** జాతీయ ఉపాధి హామీ పథకంలో పంట కాలువల్లో తూడు, తుప్పలు తొలగింపు పనులు చేపట్టాలని పెన్నాడ అగ్రహారం రైతులు కోరారు. మంగళవారం స్థానిక సర్పంచి చిల్లా అనూష అధ్యక్షతన పంచాయతీ కార్యాలయం వద్ద ఎన్ఆర్ఈజీఎస్ గ్రామ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో చేపట్టబోయే పనులు చర్చించి తీర్మానం చేశారు. ఈ సమావేశంలో కార్యదర్శి వెంకట్రాజు, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## చెరువులు కలిసున్న చోటే సమస్యలు



వాండ్రంలో రైతుల ఇబ్బందులు తెలుసుకుంటున్న తహసీల్దార్ నాగార్జున

**వాండ్రం(ఉండి), న్యూస్‌టుడే:** కొంతమంది రైతులు కలిసి చేపలు చెరువులు తవ్విన చోట్ల రెవెన్యూ సమస్యలు ఎక్కువగా కనిపిస్తున్నాయని మండల తహసీల్దార్ నాగార్జున తెలిపారు. వాండ్రం సర్పంచి దాసరి వెంకట కృష్ణ అధ్యక్షతన మంగళవారం జరిగిన రెవెన్యూ సదస్సులో ఆయన మాట్లాడారు. భూముల రీ-సర్వే సమయంలో వచ్చిన ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంపై సరైన అవగాహన లేక కొన్ని చోట్ల సమస్యలు తలెత్తాయన్నారు. కొంతమంది రైతులకు ఒకే ఖాతా ఇచ్చిన చోట్ల క్రయ, విక్రయాలు, వారసులకు భూముల పంపిణీలో ఏర్పడుతున్న ఇబ్బందుల పరిష్కారానికే ఈ సదస్సులను ప్రభుత్వం ఏర్పాటు చేసిందని తెలిపారు. అర్జీల రూపంలో రైతులు తమ ఇబ్బందులను తీసుకురావాలని కోరారు. ఎంపీటీసీ సభ్యుడు పీవీఆర్కే ఆంజనేయ రాజు, తెదేపా గ్రామ అధ్యక్షుడు కందుల బలరామ్, ఆర్.ఐ. కార్తీక్, సర్వేయర్ రత్నావళి, గ్రామ కార్యదర్శి ప్రవీణ్‌కుమార్, వీఆర్వోలు కృపాంజలి, దాస్ తదితరులు పాల్గొన్నారు.

## వేతనాలు ఇప్పించాలని వినతి



రామాంజనేయులుకు వినతి పత్రం అందజేస్తున్న చోదకులు

**భీమవరం పట్టణం, న్యూస్‌టుడే:** భీమవరం పురపాలక సంఘం ప్రజారోగ్య విభాగంలో పనిచేస్తున్న క్లాప్ వెహికల్ చోదకులకు వేతనాలు ఇప్పించాలని క్లాప్ డ్రైవర్స్ యూనియన్ సభ్యులు మంగళవారం ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులుకు వినతి పత్రం అందజేశారు. తమకు రెండు నెలలుగా వేతనాలు ఇవ్వడంలేదని, ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని వాపోయారు. అధికారులతో మాట్లాడి సమస్యను పరిష్కరిస్తానని ఎమ్మెల్యే తెలిపారు. వేతనాలు ఇవ్వని కారణంగా ఈనెల 11వ తేదీ నుంచి తామంతా విధులకు హాజరు కావడంలేదన్నారు. కార్యక్రమంలో చెల్లబోయిన రంగారావు, సీహెచ్ కుమార్, వెంకట రమణ, కేతా శ్రీను తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థుల చదువుకు ఎమ్మెల్యే సాయం

**భీమవరం పట్టణం, న్యూస్‌టుడే:** ఏడో వార్డుకు చెందిన పాఠశాల విద్యార్థులు ఎన్.సుబ్రహ్మణ్యం, పార్థుల చదువు నిమిత్తం రూ.10 వేలును భీమవరం ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు మంగళవారం అందజేశారు. దాతల సౌజన్యంతో చదువుకున్న విద్యార్థులు చాలామంది ఉన్నత స్థాయిలో స్థిర పడ్డారని ఎమ్మెల్యే అన్నారు. ప్రతిభ కలిగి చదువుకునేందుకు ఇబ్బంది పడే వారికి దాతల చేయూత ఉంటుందన్నారు.

## ఎమ్మెల్సీ ఓటు నమోదుపై నేడు సమావేశం

**భీమవరం పట్టణం, న్యూస్‌టుడే:** ఉభయ గోదావరి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల ఓటరు నమోదుపై అవగాహన కార్యక్రమాన్ని భీమవరంలో బుధవారం నిర్వహిస్తారని ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు తెలిపారు. త్యాగరాజ భవనంలో సాయంత్రం 4.30 గంటలకు జరిగే సమావేశం తెదేపా, జనసేన, భాజపా ఆధ్వర్యంలో జరుగుతుందన్నారు. కూటమి నాయకులు, కార్యకర్తలు, బూత్ ఇన్‌ఛార్జులు, పట్టభద్రులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

## 144వ సెక్షన్ పొడిగింపు

**కాళ్ల, న్యూస్‌టుడే :** ఏలూరుపాడులో 144వ సెక్షన్ మరో 15 రోజులు పొడిగించినట్లు కాళ్ల ఎస్సై శ్రీనివాసరావు మంగళవారం తెలిపారు. గ్రామంలో శాంతి భద్రతల విషయంలో ఎటువంటి విఘాతం కలగకుండా ఉండేందుకు జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు ఆకివీడు సీఐ ఆధ్వర్యంలో ఈనెల 22 నుంచి నవంబరు 5 వరకు 144వ సెక్షన్ అమలు చేయనున్నట్లు ఆయన తెలిపారు. ప్రధానంగా ఏలూరుపాడు, కాళ్ల, పెదఅమిరం గ్రామాలతో పాటు మండలంలోని అన్ని గ్రామాల్లో ఈ సెక్షన్ అమలులో ఉంటుందన్నారు.

## అందరూ అన్నదమ్ములుగా మెలగాలి



మాట్లాడుతున్న పుష్పరాజ్

**కాళ్ల, న్యూస్‌టుడే:** గ్రామంలో అందరూ అన్నదమ్ముల భావంతో ఉండాలని మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షుడు నన్నేటి పుష్పరాజ్ అన్నారు. మంగళవారం ఆనందపురం పంచాయతీ పరిధిలో ఉన్న మేకల దిబ్బ ప్రాంతం సందర్శించి ఆయన మాట్లాడారు. దిబ్బ ప్రాంతంలో దళితులను నడవకుండా చేస్తున్నారని పలువురు దళితులు పుష్పరాజ్ దృష్టికి తీసుకుని వెళ్లడంతో ఆయన వచ్చి కాళ్ల ఎస్సై శ్రీనివాస్, గ్రామ సర్పంచి ధర్మరాజు సమక్షంలో సమావేశంలో ఏర్పాటు చేసి ఇరు వర్గాలకు గొడవలు లేకుండా చేయాలని సూచించారు.

## ధరలను నియంత్రించాలి

**ఆకివీడు, న్యూస్‌టుడే:** పెరుగుతున్న నిత్యావసర సరకుల ధరలను నియంత్రించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని సీపీఎం జిల్లా కార్యదర్శి బి.బలరాం డిమాండ్ చేశారు. మంగళవారం ఆయన ఆకివీడులోని 14వ వార్డు జవహర్ పేటలో నిర్వహించిన సీపీఎం శాఖ మహాసభలో పాల్గొని మాట్లాడారు. రాష్ట్రంలో ఆహార ధాన్యాలు, మంచి నూనె తదితర నిత్యావసర సరకుల ధరలు పెరగడంతో ప్రజలు ఆర్థిక భారంలో సతమతమవుతున్నారన్నారు. తొలుత సీపీఎం జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో పార్టీ పట్టణ కార్యదర్శి కె.తవిటినాయుడు, రవితేజ, ఎస్.సూరిబాబు, బీవీ వర్మ, బి.రాజు, పాపారావు, జి.ధనుష్, సతీశ్ పాల్గొన్నారు.

**ఛార్జీలు పెంపు సరికాదు.. భీమవరం గ్రామీణ, న్యూస్‌టుడే:** విద్యుత్తు ఛార్జీలు పెంచాలని, స్మార్ట్ మీటర్లు పెట్టాలనే నిర్ణయాలను ప్రభుత్వం వెంటనే ఉపసంహరించుకోవాలని సీపీఎం మండల కన్వీనర్ ఇంజేటి శ్రీనివాస్ డిమాండ్ చేశారు. ఆ మేరకు పార్టీ శ్రేణులతో కలిసి విద్యుత్తు ఏఈ ఏడు కొండలును కలిసి వినతిపత్రం అందజేశారు. తాడేరు విద్యుత్తు ఉపకేంద్రం వద్ద జరిగిన కార్యక్రమంలో కృపాదానం తదితరులు పాల్గొన్నారు.

## నీట మునిగిన రహదారులు



**భీమవరం గునుపూడి, న్యూస్‌టుడే:** పట్టణంలో తరచూ మధ్యాహ్నం వర్షం రావడం సాధారణంగా మారింది. రెండు రోజులుగా వర్షం రాకపోవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. మంగళవారం సాయంత్రం ఒక్కసారిగా భారీ వర్షం రావడంతో పలు పల్లపు ప్రాంతాలు కొలనులుగా మారాయి. రైల్వే స్టేషన్ రోడ్డు, రైతు బజారు రోడ్డు, నాచువారి కూడలి, పంచముఖ ఆంజనేయస్వామి ఆలయం ఎదుట రహదారులపై నీరు నిలిచిపోవడంతో వాహనదారులు, పరిసర నివాసితులు ఇబ్బంది పడ్డారు. కాలువల ద్వారా నీరు పోవడానికి ఎక్కువ సమయం పడుతుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

## శిథిలావస్థలో అగ్రహారం వంతెన

### ఇనుప రేకులకు రంధ్రాలు



ఎన్నార్పీ అగ్రహారంలో పంట కాలువపై ప్రమాదభరితంగా వంతెన



**ఉండి, న్యూస్‌టుడే:** ఉండి ప్రధాన పంట కాలువపై కాలిబాట వంతెన శిథిలావస్థకు చేరింది. ఎన్నార్పీ అగ్రహారం ఉన్నత పాఠశాలకు చేర్చి రెండున్నర దశాబ్దాల కిందట పంట కాలువపై ఇరువైపులా సిమెంట్ కాంక్రీటు.. మధ్యలో నావిగేషన్ (పడవల రాకపోకల)కు ఎటువంటి అవరోధాలు తలెత్తకుండా ఈ వంతెనను నిర్మించారు. నావిగేషన్ కోసం తయారు చేసిన ప్రాంతంలో దిగువన ఇనుప చట్రాలు.. పైన రేకులు.. ఇరువైపులా ఇనుప గొట్టాలు ఏర్పాటు చేశారు. ఎండకు ఎండి.. వర్షాలకు తడుస్తూ నావిగేషన్ కోసం వేసిన కాలిబాటపై ఉంచిన రేకులు వివిధ చోట్ల దెబ్బతిని రంధ్రాలు పడుతున్నాయి. ఈ వంతెన ఇలా తయారవడానికి నిర్వహణ లోపమే ప్రధాన కారణమని స్థానికులు ఆరోపిస్తున్నారు. రెండు, మూడు చోట్ల కనిపిస్తున్న రంధ్రాలపై ఆదమరిచి అడుగేస్తే గాయాల పాలవడం ఖాయమనే పరిస్థితి కన్పిస్తోంది. వంతెన మరమ్మతులకు అధికారులు చొరవ చూపాలని కోరుతున్నారు. జలవనరులశాఖ ఉండి ఏఈ ఫణి శంకర్ మాట్లాడుతూ ఆ ప్రాంతాన్ని పరిశీలించి అవసరమైన ప్రతిపాదనలు తయారు చేస్తామని తెలిపారు.

## దారి.. సగం జారి..



వాండ్రంలో దిగబడిపోయిన ఆర్అండ్‌బీ రోడ్డు

**ఉండి, న్యూస్‌టుడే:** ఉండి, కాళ్ల మండలాలను దగ్గర చేసే ఆర్అండ్‌బీ రహదారి వివిధ చోట్ల అధ్వాన స్థితికి చేరింది. ఉండి - కోపల్లె మార్గం నాలుగైదు చోట్ల సమీపంలోని బొండాడ కాలువలోకి దిగబడి పోతోంది. కాలువ గట్లు సరిగా లేనిచోట్ల రహదారి భారీగా కుంగిపోయింది. ఆయా చోట్ల రాకపోకలు సాగించేందుకు వాహన చోదకులు ప్రత్యక్ష నరకాన్ని చవి చూస్తున్నారు. వాండ్రం - కోపల్లెల మధ్య రెండు చోట్ల ఈ పరిస్థితి నెలకొంది. కాళ్ల మండలంలోని వివిధ గ్రామాల్లోని ఆక్వా చెరువులకు తవుడు, వేరుశనగ చెక్క, చేపలు, రొయ్యల లోడుతో కూడిన 20-30 టన్నుల బరువుండే లారీలు ఈ మార్గంలో అత్యధికంగా రాకపోకలు సాగిస్తుంటాయి. కాలువ అంచులు దెబ్బతిన్న చోట్ల రహదారి భారీ వాహనాల తాకిడికి దెబ్బతిని ఇలా తయారవుతోందని వాహన చోదకులు వాపోతున్నారు. ఈఅంశంపై ఆర్అండ్‌బీ ఏఈ కె.శ్రీహరిరాజు మాట్లాడుతూ రహదారి మరమ్మతులకు ప్రతిపాదనలు ఉన్నాయన్నారు. వర్షాలు తగ్గిన వెంటనే పనులు చేపడతామని వివరించారు.

## తప్పులమయంగా రీసర్వే... సరిచేయండి



పెన్నాడ అగ్రహారంలో అధికారులకు ఫిర్యాదు చేస్తున్న రైతులు

**పాలకోడేరు, న్యూస్‌టుడే:** గత ప్రభుత్వంలో నిర్వహించిన భూముల రీ సర్వే తప్పులమయంగా ఉండటంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని పెన్నాడ అగ్రహారం రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. మంగళవారం స్థానిక పంచాయతీ కార్యాలయం వద్ద తహసీల్దారు ఎన్‌బీ విజయలక్ష్మి ఆధ్వర్యంలో రీ సర్వే గ్రామ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా కూటమి నాయకులు చేబోలు రామకృష్ణ, కునుకు రామకృష్ణ, రమేశ్ తదితరులు రీ సర్వే సందర్భంగా చోటు చేసుకున్న తప్పులను సభ దృష్టికి తీసుకొచ్చారు. రైతులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా సరిచేసి పట్టాదారు పాసు పుస్తకాలు జారీ చేయాలని కోరారు. సభ దృష్టికి వచ్చిన సమస్యలను తక్షణమే పరిష్కరిస్తామని తహసీల్దారు ఎన్ బీ విజయలక్ష్మి, రీ సర్వే డీటీ సూర్యనారాయణరాజు తెలిపారు.



గ్రామ సభలో మాట్లాడుతున్న తహసీల్దార్ రామాంజనేయులు

**వేగంగా అర్జీల పరిష్కారం.. వీరవాసరం, న్యూస్‌టుడే:** రీ సర్వే గ్రామ సభల్లో వచ్చిన అర్జీలను వీలైనంత వేగంగా పరిష్కరిస్తానని తహసీల్దార్ ఏవీ రామాంజనేయులు అన్నారు. బొబ్బనపల్లి గ్రామంలో మంగళవారం రీ సర్వే గ్రామ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ రామాంజనేయులు మాట్లాడుతూ రీ సర్వేలో వచ్చిన భూ సమస్యల పరిష్కారంలో అధికారులకు రైతులు సహకరించాలన్నారు. గ్రామ సభలో రైతుల నుంచి 19 అర్జీలు వచ్చినట్లు అధికారులు తెలిపారు. కార్యక్రమంలో ఉప తహసీల్దార్ సుబ్బారావు, ఆర్ఐ రూజ్‌వెల్ట్, సర్పంచి గూడూరి ఓంకారం రైతులు పాల్గొన్నారు.

**కొమరాడలో గ్రామసభ.. భీమవరం గ్రామీణ, న్యూస్‌టుడే:** భీమవరం మండలం కొమరాడలో రీసర్వే గ్రామసభ మంగళవారం జరిగింది. ఉప తహసీల్దార్ నాగార్జున అధ్యక్షతన జరిగిన సభలో పలువురు భూ సంబంధ సమస్యలపై ఫిర్యాదులు అందజేశారు. సర్వేయర్ నాగబాబు, వీఆర్వో కలిగొట్ల శ్రీనివాస్, గ్రామస్థులు పాల్గొన్నారు.

## సిబ్బందికి శిక్షణ.. రైతులకు అవగాహన

**ఆకివీడు, న్యూస్‌టుడే:** ఆకివీడులోని మహిళా సమాఖ్య భవనంలో మంగళవారం రైతు సేవా కేంద్రం సిబ్బందికి సీఎల్ఎస్, పీడీఎస్ఎస్, ఏపీపీ యాప్‌లపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ యాప్ అప్‌లోడ్ చేసి సెల్‌ఫోన్ల ద్వారా రైతులకు తెలియజేయడం ద్వారా మొదటి దశలో పురుగులు, తెగుళ్ల నివారణకు వాడాల్సిన మందులు తదితర సాగు విధానాలను తెలియజేయడానికి వీలవుతుందని ఏవోలు బి.నాగేశ్వరమ్మ, ఎం.ప్రియాంక వివరించారు. అనంతరం సిద్ధాపురం గ్రామంలో రైతులకు వరి సాగులో మేలైన యాజమాన్య పద్ధతులపై అవగాహన కల్పించారు.

## మద్యం దుకాణం వద్దంటూ ఫ్లెక్సీల ఏర్పాటు

**పాలకోడేరు, న్యూస్‌టుడే:** పాలకోడేరులో గొల్లలకోడేరు రహదారి మార్గంలో మద్యం దుకాణం ఏర్పాటుపై స్థానిక వివేకానంద కాలనీ వాసులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. నివాసాల మధ్యలో దుకాణాన్ని ఏర్పాటు చేయవద్దని ఇప్పటికే ఎమ్మెల్యేతో పాటు ఎక్సైజ్, పోలీసు అధికారులకు ఫిర్యాదు చేశారు. తాజాగా దుకాణం ఏర్పాటు చేయనున్న ప్రాంతంలో మద్యం దుకాణం వల్ల అసాంఘిక కార్యక్రమాలు జరుగుతాయని తెలుపుతూ ఫ్లెక్సీలను ఏర్పాటు చేశారు.

## బహిరంగంగా మద్యం తాగిన వారికి జరిమానా

**భీమవరం పట్టణం, న్యూస్‌టుడే:** భీమవరం రెండో పట్టణ పరిధిలోని బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగుతున్న 11 మందికి రూ.500 చొప్పున భీమవరం స్పెషల్ జ్యుడీషియల్ సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ మంగళవారం జరిమానా విధించారని సీఐ జి.కాళీచరణ్ తెలిపారు. బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగినా, మద్యం తాగి వాహనాలు నడిపినా చట్టపరమైన చర్యలుంటాయని సీఐ చెప్పారు.

## అవి ఇవి అన్నీ

**104 వాహన వైద్య సేవలు.. కాళ్ల, న్యూస్‌టుడే :** మండలంలో దొడ్డనపూడి పంచాయతీ కార్యాలయం, పలు ప్రాంతాల్లో కాళ్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి ఎస్.సునీల్ ఆధ్వర్యంలో పలువురికి వైద్య సేవలు అందించారు. మంగళవారం 104 వాహనం ద్వారా రోజు విడిచి రోజు ఆయా గ్రామాల్లో వైద్య సేవలు అందించి ఉచితంగా మందులు అందజేస్తున్నట్లు ఆయన తెలిపారు. సీజనల్‌గా వచ్చే వ్యాధులపై అందరూ అప్రమత్తంగా ఉండాలని, ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు.

**ఎముకల సాంద్రత పరీక్షల శిబిరం.. భీమవరం సాంస్కృతికం, న్యూస్‌టుడే :** ప్రతి ఒక్కరూ ఆహారంతో పాటు జీవనశైలిలో మార్పులు చేసుకోవాలని ఆయుర్వేద పంచకర్మ వైద్యుడు బృందావనం కృష్ణచైతన్య అన్నారు. మంగళవారం రెండో పట్టణంలో ఉన్న చరక సంజీవిని కేరళ ఆయుర్వేద పరిశోధన కేంద్రంలో ఏర్పాటు చేసిన ఉచిత ఎముకల సాంద్రత పరీక్షల శిబిరంలో ఆయన పాల్గొని మాట్లాడారు. శిబిరంలో 200 మందికి పరీక్షలు నిర్వహించినట్లు ఆయన తెలిపారు.

**ఆరో వార్డులో సమస్యలు పరిష్కరించాలి.. భీమవరం వన్‌టౌన్, న్యూస్‌టుడే:** పట్టణంలోని ఆరో వార్డులో రహదారులు, మురుగు నీటి కాల్వలను అభివృద్ధి చేయాలని సీపీఎం పట్టణ ఆరో వార్డు శాఖ మహాసభ అధికారులను డిమాండ్ చేసింది. పార్టీ నాయకుడు ములపర్తి అప్పారావు అధ్యక్షతన స్థానిక కార్యాలయం వద్ద మంగళవారం సీపీఎం శాఖ మహాసభను నిర్వహించారు. పార్టీ పట్టణ కార్యదర్శి బి.వాసుదేవరావు మాట్లాడారు. అనంతరం ఆరో వార్డు నూతన శాఖ కార్యదర్శిగా బి.సత్యనారాయణను ఎన్నుకున్నారు.



**వైద్య శిబిరానికి స్పందన.. భీమవరం వన్‌టౌన్, న్యూస్‌టుడే:** అల్లూరి సీతారామరాజు భగత్‌సింగ్ సేవా విజ్ఞాన కేంద్రం ట్రస్టు, వసుధ ఫౌండేషన్ ఆధ్వర్యంలో భీమవరం మెంటేవారితోటలోని పుచ్చలపల్లి సుందరయ్య భవనంలో మంగళవారం నిర్వహించిన చిన్నారుల ఉచిత గుండె వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. వైద్య శిబిరంలో డాక్టర్ విక్రమ్, వైద్య సిబ్బంది 30 మంది చిన్నారులకు పరీక్షలు చేశారు. కార్యక్రమంలో విజ్ఞాన కేంద్రం ట్రస్టు ఛైర్మన్ బి.బలరాం పాల్గొన్నారు.

**విజేతలకు బహుమతులు.. భీమవరం పట్టణం, న్యూస్‌టుడే:** పోలీసు అమర వీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా భీమవరం ఎ.ఆర్.కె.ఆర్ పుర పాలకోన్నత పాఠశాలలోని విద్యార్థులకు వ్యాస రచన పోటీలు మంగళవారం నిర్వహించారు. పోలీసు అమర వీరుల గురించి వక్తలు వివరించారు. విజేతలకు బహుమతులను సీఐ ఎం.నాగరాజు, ప్రధానోపాధ్యాయుడు సత్యనారాయణ అందజేశారు.

**అదనపు కట్నం వేధింపులపై ఫిర్యాదు.. భీమవరం పట్టణం, న్యూస్‌టుడే:** భీమవరం రెండో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధి చినఅమిరానికి చెందిన ఎస్.కావ్య వెంకట సాయి విజయను అదనపు కట్నం తీసుకురమ్మని భర్త, అత్తమామలు, మరో నలుగురు వేధిస్తున్నారని ఫిర్యాదు చేశారని పోలీసులు చెప్పారు. కోటిమల్లేశ్వరరావుతో 2019లో ఆమెకు వివాహమైందన్నారు. ఎస్సై రెహమాన్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

**జూద స్థావరంపై దాడి.. దిర్సుమర్రు(భీమవరం గ్రామీణ), న్యూస్‌టుడే:** భీమవరం మండలం దిర్సుమర్రు పంచాయతీ రామాయణపురంలో జూద స్థావరంపై మంగళవారం దాడులు నిర్వహించినట్లు ఎస్సై వీర్రాజు తెలిపారు. నలుగుర్ని అదుపులోకి తీసుకుని వారి నుంచి రూ.2700 స్వాధీనం చేసుకున్నట్లు వెల్లడించారు.





**భీమవరం సాంస్కృతికం, న్యూస్‌టుడే**

| | |
|---|---|
| శ్రీపద్మాలయ స్క్రీన్ 1 | వేట్టయన్ |
| శ్రీపద్మాలయ స్క్రీన్ 2 | దేవర |
| కిషోర్ స్క్రీన్ 1 | విశ్వం |
| కిషోర్ స్క్రీన్ 2 | ఇద్దరు |
| నటరాజ్ | జనక అయితే గనక |
| ఏవీజీ సినిమాస్ స్క్రీన్ 1 | వేట్టయన్ |
| ఏవీజీ సినిమాస్ స్క్రీన్ 2 | సత్యం సుందరం |
| ఏవీజీ సినిమాస్ స్క్రీన్ 3 | శ్వాగ్ |
| ఏవీజీ సినిమాస్ స్క్రీన్ 4 | దేవర |
| విజయలక్ష్మి స్క్రీన్ 1 | మార్టిన్ |
| మహాలక్ష్మి స్క్రీన్ 2 | కల్లు కాంపౌండ్ |

# నరసాపురం

• నరసాపురం • పాలకొల్లు • ఆచంట

## 25 నుంచి వాహనాల దారి మళ్లింపు

**మార్టేరు, న్యూస్‌టుడే:** రహదారి నిర్మాణ పనుల రీత్యా మార్టేరు-పాలకొల్లు మార్గంలో ఈ నెల 25 నుంచి వాహనాలను దారి మళ్లిస్తున్నట్లు ఆర్‌అండ్‌బీ ఏఈఈ యశ్వంత్ మంగళవారం తెలిపారు. మార్టేరు పరిధిలో సుమారు 700 మీటర్ల మేర సిమెంట్ రోడ్డు నిర్మాణ పనులు చేపడుతున్నట్లు చెప్పారు. దీని దృష్ట్యా పాలకొల్లు వెళ్లాల్సిన వాహనదారులు ఆలమూరు, కొమ్ముచిక్కాల మీదుగా కవిటం లేదంటే లంకలకోడేరు మీదుగా పాలకొల్లు వెళ్లాలని సూచించారు. నరసాపురం, పాలకొల్లు నుంచి వచ్చే వాహనాలను సైతం ఈ మార్గంలోనే వచ్చే విధంగా మళ్లిస్తున్నట్లు తెలిపారు. డిసెంబరు 10 తర్వాత పూర్తిస్థాయిలో వాహనాల రాకపోకలకు అనుమతిస్తామని చెప్పారు.

## వ్యాధులపై అప్రమత్తం చేయండి

**నరసాపురం, న్యూస్‌టుడే:** వర్షాల ప్రభావంతో ప్రజలు వ్యాధుల బారిన పడకుండా చైతన్యం చేయాలని పురపాలక కమిషనర్ ఎం.అంజయ్య సూచించారు. ఆయన ఛాంబర్‌లో మంగళవారం పారిశుద్ధ్య కార్యదర్శులు, ఏఎన్ఎంలతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ పలు సూచనలు చేశారు.


మాట్లాడుతున్న అంజయ్య

## అందరికీ స్వామి దర్శనం అయ్యేలా చర్యలు

**పాలకొల్లు ఆధ్యాత్మికం, న్యూస్‌టుడే:** కార్తికమాసంలో పాలకొల్లు క్షీరారామానికి వచ్చే ప్రతి ఒక్కరూ స్వామివారి దర్శనం చేసుకునేలా అన్ని సౌకర్యాలను కల్పించాలని నరసాపురం ఆర్డీవో దాసి రాజు అన్నారు. పాలకొల్లు క్షీరారామలింగేశ్వరస్వామి ఆలయంలో కార్తికమాసంలో ఏర్పాట్లపై సమీక్ష సమావేశం మంగళవారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దూర ప్రాంతాల నుంచి వచ్చే భక్తులకు వసతులు కల్పించాలని సూచించారు. పరిసర ప్రాంతాల్లో పారిశుద్ధ్యం, ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. దేవాదాయ ధర్మాదాయ శాఖ జిల్లా సహాయ కమిషనర్ వీవీ.సుబ్బారావు మాట్లాడుతూ కార్తిక నెల రోజులూ అన్నసమారాధన జరుగుతుందని చెప్పారు. తహసీల్దారు వై.దుర్గాకిశోర్, పురపాలక కమిషనర్ బి.విజయసారధి, పట్టణ ఎస్సై కె.శ్రీనివాస్, విద్యుత్తుశాఖ ఏఈ బాబ్జి, అగ్నిమాపక అధికారి జానకిరామయ్య పలువురు అధికారులు, అర్చకులు సమావేశంలో పాల్గొన్నారు.


మాట్లాడుతున్న దాసి రాజు

## ఆంజనేయస్వామికి పూజలు

**పాలకొల్లు ఆధ్యాత్మికం, న్యూస్‌టుడే:** పాలకొల్లు పట్టణం కెనాల్ రోడ్డులోని దాసాంజనేయస్వామి ఆలయంలో మంగళవారం సందర్భంగా స్వామికి ఆభరణాలు, తులసి మాలలు, వివిధ రకాల పూలతో ప్రత్యేక అలంకరణ చేశారు. తమలపాకులు, సిందూరంతో పూజలు చేశారు.

**పెనుగొండ, న్యూస్‌టుడే:** స్థానిక వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయంలో స్వామికి పూజలు, అభిషేకాలు చేశారు.

# దర్యాప్తులు ఆలస్యం.. నియామకాలు అవశ్యం!

పోలీస్ స్టేషన్లలో సిబ్బంది కొరతతో ఇబ్బంది

పాలకొల్లు, నరసాపురం, పెనుగొండ సర్కిల్స్ పరిధిలో పోలీస్ సిబ్బంది కొరత సమస్య తీవ్రంగా ఉంది. గత వైకాపా ప్రభుత్వం అయిదేళ్లలో అయిదు పోస్టులు తీసిన పాపాన పోలేదు. కూటమి ప్రభుత్వం త్వరలో పోలీసు నియామకాలు చేపడతామని చేసిన ప్రకటన పోలీస్‌శాఖకు కొంత ఊరటనిస్తుంది. 2014-19 మధ్యలో తెదేపా ప్రభుత్వం పోలీసులకు వారంలో ఒక్కరోజు సెలవు ప్రతిపాదన తీసుకొచ్చింది. తర్వాత వైకాపా ప్రభుత్వం గాలికొదిలేసింది. ప్రస్తుత కూటమి ప్రభుత్వం దీనిపై దృష్టిసారిస్తే పోలీసుల కుటుంబాలకు కొంత ఊరటనిస్తుందని పలువురు పోలీసులు కోరుతున్నారు.

ఇటీవల కాలంలో ప్రతి పోలీసు స్టేషన్లో సిబ్బంది కొరత తీవ్ర సమస్యలకు దారితీస్తుంది. కొన్ని కేసులయితే సకాలంలో పరిష్కరించలేని పరిస్థితి. పట్టణాల్లో ట్రాఫిక్ సమస్యలు జటిలంగా మారుతున్నాయి. రేయింబవళ్లు విశ్రాంతి లేకుండా ఉన్నవారే విధుల్లో కొనసాగాల్సి వస్తుంది.

**పెరుగుతున్న నేరాలు..**

ప్రశాంతంగా ఉండే డెల్టాలోను బాలికల కిడ్నాప్‌లు, ఇళ్లలో ఉంటున్న వృద్ధుల నుంచి బంగారం, నగదు దోచుకెళ్లే ముఠాలు తిరుగుతుండటం కలవరపెడుతుంది. తాళం వేసి ఉన్న ఇళ్లలో చోరీలు ఇంటి ముందున్న ద్విచక్ర వాహనాలను ఎత్తుకెళ్లడం ఇటీవల కాలంలో బాగా పెరిగిపోయింది. గంజాయి చాప కింద నీరులా విస్తరిస్తుంది. వీటన్నింటిని సమర్థంగా ఎదుర్కోవాలంటే ప్రతి పోలీసు స్టేషన్‌లోనూ సరిపడ సిబ్బంది ఉండి తీరాల్సిందే. దీనిపై పాలకొల్లు పట్టణ సీఐ రజనీకుమార్ స్పందిస్తూ ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు ప్రణాళికపరంగా చర్యలు తీసుకుంటామన్నారు. నేర నియంత్రణకు శక్తివంచన లేకుండా కృషి చేస్తున్నామన్నారు. సిబ్బంది భర్తీ త్వరలో జరగవచ్చన్నారు.

● ఎస్సైలు ✪ ఏఎస్సైలు ▲ హెడ్ కానిస్టేబుళ్లు ☛ కానిస్టేబుళ్లు

| | ● | ✪ | ▲ | ☛ |
|---|---|---|---|---|
| పట్టణంలో ఉండాల్సిన వారు | 2 | 5 | 8 | 37 |
| ఉన్నవారు | 2 | 5 | 6 | 29 |
| లోటు | 0 | 0 | 2 | 8 |
| సర్కిల్ పరిధిలో ఉండాల్సినవారు | 3 | 6 | 15 | 81 |
| పాలకొల్లు మండలంలో | 1 | 2 | 5 | 25 |
| పోడూరు | 1 | 0 | 5 | 19 |
| యలమంచిలి | 1 | 2 | 5 | 22 |
| లోటు | 0 | 2 | 0 | 15 |



కవాతు చేస్తున్న పోలీసులు



పెనుగొండ, గ్రామీణ, న్యూస్‌టుడే

**సమస్య:** సిద్ధాంతం అయ్యన్నగారి కొట్టు సమీపంలో రహదారి చెంతన చెత్త వేస్తున్నారు. దీంతో ఆ ప్రాంతం అపరిశుభ్రంగా మారుతుంది. **- ఏడుకొండలు, స్థానికుడు, సిద్ధాంతం**

**సమాధానం:** పరిశీలించి ఆ ప్రాంతాన్ని శుభ్రం చేయిస్తాం. **- కిశోర్‌బాబు కార్యదర్శి, సిద్ధాంతం.**

**సమస్య:** పెనుగొండ శివాలయం వీధిలో డ్రెయిన్ పొంగి మురుగు రహదారిపై ప్రవహించడంతో రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నాం. **- వి.రమేష్, పెనుగొండ**

**సమాధానం:** సమస్య పరిష్కారానికి తగిన చర్యలు తీసుకుంటాం. **- టి.రత్నాకరరావు, పంచాయతీ కార్యదర్శి, పెనుగొండ**

నరసాపురం, మొగల్తూరు, న్యూస్‌టుడే

**సమస్య:** పట్టణంలోని కనకదుర్గమ్మ ఆలయ మార్గానికి ఉన్న డ్రెయిన్ పూడిపోయింది. దీంతో మురుగు ప్రవహించే వీలులేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం. **- నెక్కంటి వెంకట్రామయ్యచౌదరి, నరసాపురం.**

**సమాధానం:** పరిశీలించి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటా. **- ఎం.అంజయ్య, కమిషనర్, పురపాలక సంఘం**

**సమస్య:** పట్టణంలోని మిషన్‌హైస్కూలు మార్గంలో వీధి దీపాలు వెలగక రాత్రి సమయంలో తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నాం. **-శామ్యేలు, నరసాపురం**

**సమాధానం:** వీధి దీపాల మరమ్మతులకు చర్యలు చేపడతా. **- ఎం.అంజయ్య, కమిషనర్, పురపాలకసంఘం, నరసాపురం.**

**సమస్య:** పేరుపాలెంసౌత్‌లో రహదారికి ఇరువైపులా నీరు నిలిచి పారిశుద్ధ్యం క్షీణిస్తుంది. మురుగు బయటకు వెళ్లేలా తగు చర్యలు చేపట్టాలి. **- కె.వెంకటనారాయణ, పేరుపాలెంసౌత్**

**సమాధానం:** మురుగు సమస్య పరిష్కారానికి చర్యలు చేపడతా. **- ఎం.నవీన్‌కిరణ్, పంచాయతీల విస్తరణాధికారి, మొగల్తూరు.**

**సమస్య:** కొత్తపాలెంలో ప్రధాన కూడలి నుంచి గ్రామంలోకి వెళ్లే రహదారికి ఏర్పాటుచేసిన పలు వీధి దీపాలు వెలగడం లేదు. **- సత్యనారాయణ, కొత్తపాలెం**

**సమాధానం:** వీధి దీపాలకు మరమ్మతులు చేయించేందుకు చర్యలు చేపడతా. **- బి.మణికంఠ, పంచాయతీ కార్యదర్శి, కొత్తపాలెం**

### సమస్యలు పరిష్కరించారు..

స్పందనకు వందనం

**నరసాపురం గ్రామీణ, న్యూస్‌టుడే:** మల్లవరం పెదలంక మురుగు కాలువ నుంచి మల్లవరం, వెలివెలి వెళ్లే ప్రధాన రహదారి చెంత కొంత మేర రహదారిని అసంపూర్తిగా వదిలేశారు. ఈ సమస్యపై గత నెల 22న మేమున్నాం.. మీకు తోడుగా.. శీర్షికన ప్రచురించిన కథనానికి ఎమ్మెల్యే బొమ్మిడి నాయకర్ స్పందించారు. అసంపూర్తిగా ఉన్న రహదారిని పూడ్చి రాకపోకలకు ఇబ్బంది లేకుండా చేయించారు.

**నరసాపురం గ్రామీణ, న్యూస్‌టుడే:** మల్లవరం-తిల్లపూడి పాలెం ప్రధాన రహదారిపై రజకుల చెరువు సమీపంలో ఉన్న విద్యుత్తు పరివర్తకం తీగలు బయటకు వచ్చి ప్రమాదకరంగా మారాయి. దీనిపై ఈ నెల 21న 'మేమున్నాం..మీకు తోడుగా..' శీర్షికన ప్రచురించడంతో విద్యుత్తుశాఖ ఏఈఈ కొల్లి సుధాకర్ స్పందించారు. సిబ్బందితో తీగలు సరిచేయించారు.

## గృహావసర సిలిండర్లు వినియోగిస్తే చర్యలు

**మొగల్తూరు, న్యూస్‌టుడే:** హోటళ్లు, ఇతర వ్యాపార సంస్థల్లో గృహావసరాల వంట గ్యాస్ సిలిండర్లను వినియోగిస్తే చర్యలు తప్పవని తహసీల్దారు కె.రాజకిశోర్ హెచ్చరించారు. ముత్యాలపల్లిలో పలు హోటళ్లను ఆయన సిబ్బందితో కలిసి తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా గృహావసరాల వంట గ్యాస్ వినియోగిస్తున్న ఒక హోటల్ యజమానిపై కేసు నమోదు చేశారు. సిలెండరు స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఆయన వెంట డీటీ సంధ్య తదితరులు ఉన్నారు.


వివరాలు వెల్లడిస్తున్న తహసీల్దారు రాజకిశోర్ తదితరులు

## వంటగ్యాస్ వినియోగంపై అవగాహన

**నరసాపురం, న్యూస్‌టుడే:** వంటగ్యాస్ వినియోగ సమయంలో ప్రమాదాల నివారణపై మంగళవారం పట్టణంలోని ప్రభుత్వ బాలికల పాఠశాలలో అవగాహన సదస్సు నిర్వహించారు. గోదావరి గ్యాస్ కంపెనీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ సదస్సులో టెక్నీషియన్లు గ్యాస్ పొదుపు, ప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. ఆ సంస్థ మేనేజరు యం.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

## సృజనను వెలికి తీసేందుకే..

### 'ఈనాడు' ప్రతిభాపాటవ పోటీలు

**పాలకొల్లు పట్టణం, న్యూస్‌టుడే:** విద్యార్థులు నైపుణ్యాలను పెంపొందించుకోవాలని మాంటిస్సోరి స్కూల్ డైరెక్టర్ కె.వి.కృష్ణవర్మ అన్నారు. స్థానిక లజపతిరాయ్‌పేట మాంటిస్సోరి పాఠశాలలో 'ఈనాడు ప్రతిభాపాటవ పోటీలు మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల్లో సృజనాత్మకత వెలికితీసేందుకు 'ఈనాడు' చేస్తున్న ప్రయత్నం అభినందనీయమన్నారు. అంతర్జాలం వినియోగంతో లాభనష్టాలు, విద్యార్థులపై సామాజిక మాధ్యమాల ప్రభావం అనే అంశంపై నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో ప్రథమస్థానంలో డి.ఉషశ్రీ (8వ తరగతి), ద్వితీయస్థానంలో టి.నందిని (10వ తరగతి), తృతీయస్థానంలో బి.జాహ్నవి (9వ తరగతి) నిలిచారు. విజేతలకు స్కూల్ డైరెక్టర్ కృష్ణవర్మ బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ ఎస్.వి.ఎస్ ప్రకాశరావు, ఇన్‌ఛార్జి యు.లలిత, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


వ్యాసరచన పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు



బహుమతులు అందజేస్తున్న కృష్ణవర్మ

## మద్దతు కోరుతూ ప్రచారం

**యలమంచిలి, న్యూస్‌టుడే:** ఉపాధ్యాయ ఎమ్మెల్సీగా పోటీ చేస్తున్న బొర్రా గోపీమూర్తిని గెలిపించాలని ఎమ్మెల్సీ ఇళ్ల వెంకటేశ్వరరావు(ఐవీ) అన్నారు. యలమంచిలి మండలంలోని 11 ఉన్నత పాఠశాలలు, యలమంచిలి జూనియర్ కళాశాలల్లో ఆయన మంగళవారం ప్రచారం నిమిత్తం ఉపాధ్యాయులను కలిశారు. వై.వి.లంక ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజనం నాణ్యతను ఆయన పరిశీలించారు.


మొగల్తూరు: ఉపాధ్యాయులతో గోపీమూర్తి

**మొగల్తూరు, న్యూస్‌టుడే:** శాసనమండలి ఉపాధ్యాయ నియోజకవర్గ ఎన్నికల్లో తనకు విజయం చేకూర్చాలని కోరుతూ పీడీఎఫ్ బలపరిచిన అభ్యర్థి బొర్రా గోపీమూర్తి మంగళవారం ప్రచారం చేశారు. ఆయన మండలంలోని జడ్పీ ఉన్నత పాఠశాలల్లో ఉపాధ్యాయులను కలిసి ఎన్నికల్లో తనకు విజయం చేకూర్చాలని కోరారు.

## ప్రభాస్ అభిమానుల ప్రదర్శన

**నరసాపురం, న్యూస్‌టుడే:** నరసాపురం పట్టణంలో సినీ హీరో యంగ్ రెబల్‌స్టార్ ప్రభాస్ అభిమానులు మంగళవారం ద్విచక్ర వాహన ప్రదర్శన చేశారు. పట్టణంలోని ప్రధాన రహదారులపై భారీ ప్రదర్శన చేశారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో ఘర్షణ వాతావరణం నెలకొంది. నరసాపురం పట్టణ, గ్రామీణ సీఐలు బి.యాదగిరి, కె.దుర్గాప్రసాద్‌లు సిబ్బందితో వెళ్లి పరిస్థితి అదుపు చేశారు.

## బాధ్యులపై చర్యలు అవసరం

**ఆచంట, న్యూస్‌టుడే:** ఆచంట మండలం కొడమంచిలి తురకవానిమెరకలో ఇళ్ల స్థలాల విషయంలో అక్రమాలకు పాల్పడిన వైకాపా నాయకులపై అధికారులు చర్యలు తీసుకుని, లబ్ధిదారులకు న్యాయం చేయాలని కూటమి నాయకులు కోరారు. ఈ మేరకు మంగళవారం గ్రామంలో నాయకులతో టి.మెరక వాసులు సమావేశమయ్యారు.

## ఓటు నమోదుకు అవకాశం

**పాలకొల్లు పట్టణం, న్యూస్‌టుడే:** అర్హులైన పట్టభద్రులంతా ఎమ్మెల్సీ ఓటు నమోదుకు నవంబర్ 6లోగా దరఖాస్తు చేసుకోవాలని తహసీల్దార్ వై.దుర్గాకిషోర్ మంగళవారం తెలిపారు. అక్టోబర్ 2021 నాటికి పట్టభద్రులైన వారంతా అర్హులన్నారు. ఆఫ్‌లైన్‌లో ఓటు నమోదుకు ఫారం-18తోపాటు అటెస్టేషన్ చేయించిన డిగ్రీ ప్రొవిజనల్ సర్టిఫికెట్, ఆధార్‌కార్డునఖలు, ఓటరు కార్డు నఖలు, ఫొటో, మొబైల్ నంబర్‌ను నిర్దేశిత కేంద్రాల్లో అందజేయాలన్నారు. ఈ అవకాశాన్ని యువత సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

## బురద దారితో బెంబేలు..!

**పెనుగొండ గ్రామీణ, న్యూస్‌టుడే:** గత కొన్ని రోజులుగా కురుస్తున్న వర్షాలకు దేవ - పెళ్లికూతురమ్మ చెరువు రహదారి సుమారు రెండు కిలోమీటర్లు మేర బురదతో అధ్వానంగా మారింది. దీంతో వాహనచోదకులు, రైతులు, పాదచారులు రాకపోకలకు సాగించేందుకు ఇబ్బందులు పడుతున్నారు. ఈ విషయంపై ఉన్నతాధికారులకు నివేదించినట్లు పంచాయతీ కార్యదర్శి బి.వెంకటేశ్వరరావు చెప్పారు.



## మలుపులు.. ప్రమాదాలకు పిలుపులు

**నరసాపురం గ్రామీణ, న్యూస్‌టుడే:** నరసాపురం వయా మత్స్యపురి భీమవరం ప్రధాన రహదారిపై పలుచోట్ల ఉన్న మలుపులు ప్రమాదకరంగా మారాయి. మలుపుల విషయంలో అధికారులు పట్టించుకోవడం లేదని వాహన చోదకులు, పలు గ్రామాల ప్రజలు వాపోతున్నారు. మలుపుల వద్ద హెచ్చరిక బోర్డులు, వేగనిరోధకాలు ఏర్పాటు చేయకపోవడంతో ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయని వాహన చోదకులు వాపోతున్నారు. లిఖితపూడి, కొప్పర్రు బద్దావానిపేట, జడ్పీ ఉన్నత పాఠశాల, మత్స్యపురి రామాలయం కూడలి, కె.బేతపూడి గ్రామ సచివాలయం కూడళ్లలో ఎదురుగా వచ్చే వాహనాలు కనపడని మలుపులున్నాయి. దీంతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని స్థానికులు చెబుతున్నారు. ఈ పరిస్థితిపై ర.భ.శాఖ నరసాపురం డీఈఈ జీవీఎస్ కిరణ్ కుమార్ మాట్లాడుతూ రహదారి పొడవునా ఉన్న పలు మలుపుల వద్ద ఇప్పటికే హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశామన్నారు. వాటిని చెట్లకొమ్మలు, తుప్పలు కప్పేయడంతో కనపడటం లేదన్నారు. వాటిని శుభ్రం చేయిస్తామని చెప్పారు.


కె.బేతపూడిలో మురుగు కాలువ వద్ద మలుపు ఇలా..

## కొత్త దుకాణాలు నిర్మించాలి

**ఆచంట, న్యూస్‌టుడే:** ఆచంట మార్కెట్ వద్ద శిథిలమైన దుకాణాల భవనం తొలగించి, కొత్త షాపులు నిర్మించాలని సీపీఎం జిల్లా నాయకులు కె.గోపాలన్ కోరారు. మంగళవారం ఆచంట కొత్తూరు శాఖ గ్రామసభ నిర్వహించారు. మార్కెట్ వద్ద శుభ్రతపై ఆందోళన వ్యక్తం చేశారు. గ్రామంలో సమస్యలపై చర్చించారు. కొత్తూరు గ్రామ కార్యదర్శిగా ఎస్వీఎస్ శర్మను సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.


ఆచంట సెంటర్‌లో నినాదాలు చేస్తున్న నాయకులు

### అవి ఇవి అన్నీ

**అనారోగ్య బాధితులకు ఆర్థిక సాయం.. పాలకొల్లు పట్టణం, న్యూస్‌టుడే:** అనారోగ్యంతో బాధపడుతున్న ముగ్గురికి వైద్యఖర్చుల నిమిత్తం వసుధా ఫౌండేషన్ రూ.40 వేలు ఆర్థిక సాయం మంగళవారం అందజేసింది.

**తప్పనిసరిగా అనుమతులు పొందాలి.. పోడూరు, న్యూస్‌టుడే:** దీపావళి నేపథ్యంలో గ్రామాల్లో బాణసంచా అమ్మకం చేసే చిల్లర వర్తకులు తప్పనిసరిగా తాత్కాలిక అనుమతులు పొందాలని తహసీల్దార్ సయ్యద్ మౌలానా ఫాజిల్ ఒక ప్రకటనలో తెలిపారు.

**రహదారి విస్తరణ పనులు ప్రారంభం.. మార్టేరు, న్యూస్‌టుడే:** పెనుగొండ - పాలకొల్లు మార్గంలో మార్టేరు వద్ద రహదారి విస్తరణ పనులను మంగళవారం ప్రారంభించారు. స్థానికంగా 700 మీటర్లు మేర సిమెంట్ రహదారి నిర్మాణం చేయనున్నారు. దీనిలో భాగంగా దారికి ఇరువైపులా ఆక్రమణలు, చెట్లు, గట్లను తొలగించి నల్లకంకర పరుస్తున్నారు. ఏడాది నాడు మార్టేరు-పాలకొల్లు మధ్య రహదారి విస్తరణ, రక్షణ గోడల నిర్మాణం ఇతర అభివృద్ధి పనులు సుమారు రూ.25 కోట్లతో చేపట్టగా ఇందులో భాగంగా ఇక్కడ సీసీ రహదారి నిర్మాణం చేస్తున్నట్లు అధికారులు తెలిపారు.

**జాబ్ మేళా.. ఆచంట, న్యూస్‌టుడే:** ఆచంట ప్రభుత్వ ఐటీఐలో రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, నేషనల్‌కెరీర్ సర్వీస్ ఆధ్వర్యంలో మంగళవారం జాబ్ మేళా నిర్వహించారు. మేళాకు 44 మంది నిరుద్యోగులు హాజరుకాగా 25 మంది వివిధ ఉద్యోగాలు ఎంపికైనట్లు ఐటీఐ కళాశాల ప్రిన్సిపల్ ఇందుకూరి వెంకట సత్యనారాయణరాజు తెలిపారు.

**ధార్మిక సమితులను బలోపేతం చేయాలి.. నరసాపురం గ్రామీణ, న్యూస్‌టుడే:** హిందూ సమాజంలో ఆధ్యాత్మికతను మరింతగా పెంపొందించేందుకు గ్రామ ధార్మిక సమితులను బలోపేతం చేయాల్సిన ఆవశ్యకత ఉందని గోదావరి జోన్ ధర్మ ప్రచారకులు టీపీవీ జగన్నాథం అన్నారు. సీతారాంపురం సౌత్‌లోని స్వర్ణాంధ్ర ఇంజినీరింగ్ కళాశాలలో మంగళవారం నిర్వహించిన ధార్మిక సమితి కన్వీనర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. మతం మార్పిడి వల్ల జరిగే నష్టాలు వాటి నియంత్రణ అంశాలపై మాట్లాడారు.

**ఆరోగ్య కేంద్రానికి వితరణ.. నరసాపురం, న్యూస్‌టుడే:** నరసాపురం రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో స్థానిక ఎన్టీఆర్ కాలనీలో ఉన్న పట్టణ ఆరోగ్య కేంద్రానికి ఫ్రిజ్ అందించారు. ఈ కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షురాలు గన్నాబత్తుల సత్యవతి, సూర్యకుమారి తదితరులు పాల్గొన్నారు.

## కొనసాగిన శిక్షణ తరగతులు

**మార్టేరు, న్యూస్‌టుడే:** మార్టేరు ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానంలో సమగ్ర సస్య రక్షణ- మానవ వనరుల సంరక్షణ అంశంపై ఐదు రోజుల పాటు నిర్వహిస్తున్న శిక్షణ తరగతులు రెండో రోజు మంగళవారం కొనసాగాయి. పురుగుమందుల వాడకంలో మెళకువలు, సమగ్ర సస్యరక్షణ, తెగుళ్ల నివారణ, కలుపు యాజమాన్యం, వరి రకాల అభివృద్ధిలో బయోటెక్నాలజీ పాత్ర, వరి రకాల్లో నిద్రావస్థ ప్రాముఖ్యత వంటి అంశాలపై శాస్త్రవేత్తలు ఎస్.దయాకర్, నందకిషోర్, భువనేశ్వరి, రమేష్‌బాబు, వెరోనిక, రోజా అనేక విషయాలు వివరించారు. కేంద్రీయ సస్యరక్షణ కేంద్రం జాయింట్ డైరెక్టర్ సద్దిఖీ, పరిశోధన స్థానం విస్తరణ విభాగం ప్రధాన శాస్త్రవేత్త ఎంవీ.కృపాజీ, వీరయ్యచౌదరి, సురేష్, ఉదయ్‌శంకర్, తదితరులు పాల్గొన్నారు.


హాజరైన వివిధ జిల్లాల ప్రతినిధులు

## బాణసంచా సామగ్రి స్వాధీనం

**నరసాపురం, న్యూస్‌టుడే:** అనుమతి లేకుండా ఇంట్లో నిలువచేసిన బాణసంచా సామగ్రిని మంగళవారం స్వాధీనం చేసుకున్నామని పట్టణ ఎస్సై సీహెచ్ జయలక్ష్మి తెలిపారు. ఎస్సై కథనం ప్రకారం.. రుస్తుంబాదలోని 28వ వార్డు తుంగపాటిచెరువు ప్రాంతానికి చెందిన మానేపల్లి సాయిమల్లేశ్వరరావు సుమారు రూ.20 వేల విలువగల బాణసంచా నిలువ చేశాడన్నారు. తమకు అందిన సమాచారం మేరకు ఆ ఇంట్లో తనిఖీ చేసి బాణసంచా స్వాధీనం చేసుకుని ఆ వ్యక్తిపై కేసు నమోదు చేశామని జయలక్ష్మి తెలిపారు.


## ఆందోళనొద్దు.. అర్జీలు పరిశీలిస్తారు

**ఆచంట, పోడూరు, పెనుమంట్ర, యలమంచిలి, నరసాపురం గ్రామీణ, న్యూస్‌టుడే:** వ్యవసాయ భూములు రీసర్వే పూర్తయిన గ్రామాల్లో రైతులు ఆందోళన చెందనవసరం లేదని, అన్ని అర్జీలు పరిశీలిస్తారని ఆచంట ఇన్‌ఛార్జి తహసీల్దార్ సోమేశ్వరరావు అన్నారు. మంగళవారం కరుగోరుమిల్లిలో రీసర్వే గ్రామ సభలో మాట్లాడారు. గ్రామంలో కొందరు రైతులు తమ భూమి విస్తీర్ణం కంటే రీసర్వేలో తక్కువగా చూపారని ఆందోళన వ్యక్తం చేశారు. గ్రామంలో వివిధ భూసమస్యలకు సంబంధించి 30 వరకూ గ్రామ సభలో అర్జీలు వచ్చాయి. రీసర్వే డీటీ, సర్వేయర్‌తో పాటు వీఆర్వో పి.బాలబాలాజీ తదితరులు పాల్గొన్నారు. రీసర్వే జరిగిన కవిటం, సోమరాజు ఇల్లిందపర్రులో నిర్వహించిన గ్రామ సభలో అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా తహసీల్దార్లు సయ్యద్ మౌలాన్ ఫాజిల్, వై.రవికుమార్ మాట్లాడారు. ★ యలమంచిలి మండలం మేడపాడులో తహసీల్దార్ పవన్‌కుమార్ అధ్యక్షతన రెవెన్యూ సదస్సు నిర్వహించారు. భూసమస్యలపై మొత్తం 17 దరఖాస్తులు రైతుల నుంచి స్వీకరించారు. సర్పంచి గంటా శాంతకుమారి, ఆర్.ఐ. యశోద పాల్గొన్నారు. ★ నరసాపురం మండలం సరిపల్లిలో గ్రామ సర్పంచి ఈదా సురేశ్ బాబు అధ్యక్షతన నిర్వహించిన రీసర్వే గ్రామ సభలో ఉప తహసీల్దార్ ఎన్‌వీఎస్ ప్రసాద్ మాట్లాడారు.


కరుగోరుమిల్లి రీసర్వే గ్రామసభలో రైతులు, సిబ్బంది

## మృతదేహం గుర్తింపు

**యలమంచిలి, న్యూస్‌టుడే:** చించినాడ గోదావరి వంతెన పైనుంచి ఈ నెల 20న నదిలోకి దూకి గల్లంతయిన పూలపల్లికి చెందిన ఈదా కోదండరామ్(18) మృతదేహాన్ని కోనసీమ జిల్లా సఖినేటిపల్లి ప్రాంతంలో మంగళవారం గుర్తించారు. పోస్టుమార్టం నిమిత్తం పాలకొల్లు ప్రభుత్వాసుపత్రికి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై గుర్రయ్య తెలిపారు. మృతునికి తల్లిదండ్రులున్నారు.


కోదండరామ్ (పాతచిత్రం)

## యువకుడికి గాయాలు

**మొగల్తూరు, న్యూస్‌టుడే:** రహదారి ప్రమాదంలో యువకుడు గాయపడిన ఘటన ముత్యాలపల్లిలో మంగళవారం చోటుచేసుకుంది. స్థానికుల సమాచారం మేరకు .. మొగల్తూరు వైపు నుంచి కృష్ణా జిల్లా మచిలీపట్నం ద్విచక్రవాహనంపై వెళ్తున్న యువకుడు గ్రామంలో రహదారిపై ఉన్న ఆవును ఢీకొట్టాడు. దీంతో ఆ యువకుడి తలకు, చేతికి గాయాలయ్యాయి. మాజీ సర్పంచి కర్రి వీరాస్వామి గ్రామస్థుల సహకారంతో అతడిని అత్యవసర వాహనంలో నరసాపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

## ద్విచక్ర వాహనాల దహనం

**మొగల్తూరు, న్యూస్‌టుడే:** ముత్యాలపల్లి పంచాయతీ గెదళ్లవంపు గ్రామంలో సోమవారం రాత్రి దుండగులు రెండు ద్విచక్రవాహనాలకు నిప్పంటించారు. గ్రామానికి చెందిన బందన మల్లికాసులు, చక్కారాజు వారి ఇంటి సమీపంలో రహదారి పక్కన ద్విచక్రవాహనాలు నిలిపారు. రాత్రి సమయంలో గుర్తుతెలియని వ్యక్తులు ఆ వాహనాలపై పెట్రోల్ పోసి నిప్పంటించారు. అలికిడికి సమీపంలోని ఇంట్లో వ్యక్తులు కేకలు వేయడంతో ఆ ప్రాంతానికి చెందిన పలువురు అక్కడకు చేరుకుని మంటలు ఆర్పివేశారు.

## కాలువ నిండా వ్యర్థాలే..!

నిడదవోలు - నరసాపురం ప్రధాన కాలువ వ్యర్థాల కారణంగా కలుషితమవుతుంది. ఆచంట నియోజకవర్గంలోని పెనుగొండ, పెనుమంట్ర, పోడూరు మండలాల్లోని పలు గ్రామాల పరిధిలో ప్రవహించే ఈ కాలువ వెంబడే చెత్త డంప్ చేస్తున్నారు. పెనుగొండ, నెగ్గిపూడి, మార్టేరు, పోడూరు పరిధిలో సమీప దుకాణదారులు, నివాసితులు చెత్తను నేరుగా ఈ కాలువలో వేస్తున్నారు. కొన్ని చోట్లయితే ఖాళీ మద్యం సీసాలను సైతం దీనిలోనే పడేస్తున్నారు. రాత్రి సమయంలో సెప్టిక్ ట్యాంకు వ్యర్థాలను వాహనాల్లో తెచ్చి కాలువలోనే వదిలేస్తున్నారు. పైగా కాలువ వెంబడి ఉన్న చెట్లను తొలగించిన సందర్భంలో వాటిని కాలువలోకే నెట్టేస్తున్నారు. ఈ నీటినే తాగునీటి చెరువులకు మళ్లిస్తున్నారు. ఫలితంగా ప్రజలకు సురక్షితంగా మంచి నీరు అందని పరిస్థితి నెలకొంది. స్థానిక జలవనరుల శాఖ ఏఈ జయశంకర్ స్పందిస్తూ పంట కాలువల్లో వ్యర్థాలు వేయకుండా పంచాయతీల అధికారులు చర్యలు తీసుకోవాలని సూచిస్తున్నామని చెప్పారు. **- న్యూస్‌టుడే, పోడూరు**


కాలువ గట్టుపై చెత్తకుప్పలు

## దారి ఇలా.. ప్రయాణమెలా..!

గ్రామాల్లో ప్రధాన రహదారుల అంచులు ప్రమాదకరంగా మారాయి. నిర్వహణ లేక మొక్కలు కప్పేయడంతో వాహన చోదకులు రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నారు. ఆచంట నియోజకవర్గ పరిధిలో పలు గ్రామాల్లో ఈ సమస్య కనిపిస్తోంది. నిత్యం వేలాది మంది రాకపోకలు సాగించే పెనుగొండ-పాలకొల్లు మార్గంలో జిన్నూరు, వేడంగి ప్రాంతాల్లో రహదారి అంచు మరీ సమస్యగా మారింది. మాముడూరు గోస్తనీ-వేల్పూరు కాలువ వంతెన వద్ద, మార్టేరు-ఆచంట రోడ్డు, మార్టేరు- పెనుగొండ రహదారి అంచులు సైతం అంతంత మాత్రంగా మారాయి. ఈ క్రమంలో ప్రమాదాలు జరిగి చోదకులు గాయపడుతున్న ఘటనలు ఎక్కువగా జరుగుతున్నాయి. ఈ పరిస్థితిపై ఆర్‌అండ్‌బీ ఏఈ ప్రసాద్ మాట్లాడుతూ పరిశీలించి తగు చర్యలు తీసుకుంటామని చెప్పారు. **- న్యూస్‌టుడే, జిన్నూరు(పోడూరు)**



# తాడేపల్లిగూడెం

• తాడేపల్లిగూడెం • తణుకు

## సమష్టి కృషితో దోమల నివారణ



కరపత్రం అందిస్తున్న ఆరోగ్య అధికారి లక్ష్మణరావు తదితరులు

**అప్పారావుపేట (తాడేపల్లిగూడెం వన్‌టౌన్), న్యూస్‌టుడే:** గ్రామస్థుల సమష్టి కృషితో దోమలను అరికట్టవచ్చని తాడేపల్లిగూడెం మలేరియా సబ్‌యూనిట్ అధికారి వైవీ లక్ష్మణరావు అన్నారు. మండలంలోని అప్పారావుపేట, వెంకట్రావుపాలెం గ్రామాల్లో ఆరోగ్య సిబ్బందితో పర్యటించి వ్యాధులపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ఆరోగ్య కార్యదర్శులు బేబి, లక్ష్మి, అంగన్‌వాడీ సిబ్బంది, ఆశా, ఆరోగ్య కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## 109 మందికి పరీక్షలు



రోగికి పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యురాలు

**అత్తిలి గ్రామీణం, న్యూస్‌టుడే:** అత్తిలి లయన్స్ క్లబ్ భవనంలో మంగళవారం శింగులూరి చంద్రశేఖర్ ఆర్థిక సహకారంతో ఉచిత దంత వైద్య శిబిరం నిర్వహించారు. భీమవరం విష్ణు దంత వైద్యశాల వైద్యుల నేతృత్వంలో 109 మంది రోగులకు వైద్య చికిత్స అందించారు. చికిత్స చేసి, రోగులకు ఉచితంగా మందులు అందజేశారు. కార్యక్రమంలో క్లబ్ కార్యదర్శి వెంకట నారాయణ, కోశాధికారి గంగాధరరావు, దాసం బాబ్జీ, గొర్లి వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.

## రొమ్ము క్యాన్సర్‌పై అవగాహన

**పెంటపాడు, న్యూస్‌టుడే:** పెంటపాడులోని డీఆర్ గోయెంకా ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మంగళవారం ప్రిన్సిపల్ ఎన్.వెంకటేశ్వరరావు అధ్యక్షతన రొమ్ము క్యాన్సర్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు. పెంటపాడు పీహెచ్‌సీ వైద్య సిబ్బంది పి.ఏసుజ్యోతి మాట్లాడుతూ బయట దొరికే ఫాస్ట్‌ఫుడ్, తినుబండారాలు, డ్రగ్స్, చెడువ్యసనాలకు దూరంగా ఉండాలని విద్యార్థులకు సూచించారు. కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## 26న సామాజిక ప్రజావేదిక

**అత్తిలి గ్రామీణం, న్యూస్‌టుడే:** మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో అత్తిలి మండలంలోని 18 గ్రామ పంచాయతీల్లో 2023- 24లో చేసిన పనులపై ఈ నెల 17 నుంచి 25 వరకు గ్రామ స్థాయిలో సామాజిక తనిఖీలు నిర్వహిస్తారు. 26న అత్తిలి మండల పరిషత్తు కార్యాలయంలో ప్రజావేదిక కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో శామ్యూల్ తెలిపారు.

# కంచికి చేరిన క్లాప్ కథ



నిలిచిన క్లాప్ వాహనాలు

**తాడేపల్లిగూడెం అర్బన్, న్యూస్‌టుడే:** గత ప్రభుత్వం చేసిన పనులకు ఎన్డీయే ప్రభుత్వం మూల్యం చెల్లిస్తోంది. చెత్తపై పన్ను విధించి వైకాపా అబాసుపాలైంది. నిర్వహణ భారం కావడంతో ఇంటింటా చెత్త సేకరణకు తీసుకొచ్చిన క్లాప్ వాహనాల కథ కంచికి చేరింది. రూ.లక్షల్లో బకాయిలు పేరుకుపోవడంతో ప్రైవేట్ ఏజెన్సీలు వాహనాలను షెడ్లకు పరిమితం చేశారు. రూ.కోట్లు వెచ్చించి సమకూర్చిన వాహనాలు ఎండకు ఎండుతూ వానకు తడుస్తున్నాయి. రోజూ చెత్త సేకరణకు ఇంటి ముంగిటకు వచ్చే వాహనాలు పది రోజులుగా రాకపోవడంతో తాడేపల్లిగూడెం పుర ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

☛ పట్టణంలో పారిశుద్ధ్యం మెరుగుపరచడానికి గత ప్రభుత్వం ఏర్పాటు చేసిన సమాంతర వ్యవస్థ క్లాప్ కష్టాల్లో పడింది. ఎన్డీయే ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత చెత్త పన్ను చెల్లింపులను పూర్తిగా రద్దు చేసింది.

| | |
|---|---|
| వార్డులు: 35 | జనాభా: 1.15 లక్షలు |
| నివాసాలు: 28,112 | క్లాప్ వాహనాలు: 34 |
| రోజూ ఉత్పత్తి అయ్యే చెత్త: 7 టన్నులు | |

దీంతో ప్రజలపై భారం తగ్గినా వాహనాల నిర్వహణ పురపాలక సంఘానికి భారంగా మారింది. పట్టణంలోని 34 వాహనాలకు ప్రతి నెలా రూ.18.78 లక్షలు ప్రైవేట్ ఏజెన్సీలకు చెల్లించాల్సిన పరిస్థితి. అయినప్పటికీ సుమారు ఐదు నెలలపాటు సాధారణ నిధుల నుంచి బిల్లులు చెల్లించారు. ఫలితంగా ఖజానా ఖాళీ అయ్యింది. ఆరు నెలలుగా క్లాప్ గుత్తేదారులకు బిల్లులు చెల్లించకపోవడంతో రూ.1.87 కోట్లు బకాయిలు పేరుకుపోయాయి. కార్మికులకు, డ్రైవర్లకు జీతాలు అందని పరిస్థితి. గత్యంతరం లేక గుత్తేదారులు పది రోజులుగా వాహనాలను నిలిపివేశారు.

### పాత విధానం అమలు

రాష్ట్ర విభజన అనంతరం అధికారంలోకి వచ్చిన తెదేపా ప్రభుత్వ హయాంలో పుష్ కార్టుల ద్వారా పారిశుద్ధ్య సిబ్బంది ఇంటింటికీ వెళ్లి చెత్తను సేకరించేవారు. క్లాప్ వాహనాలు రాకపోవడంతో అధికారులు పాత విధానాన్ని అమల్లోకి తీసుకొచ్చారు. ప్రస్తుతం అందుబాటులో ఉన్న 40 పుష్ కార్టులు, మూడు మినీ కాంపాక్టర్లు, రెండు బిగ్ కాంపాంక్టర్లు, తొమ్మిది ట్రాక్టర్ల సహాయంతో వార్డుల్లో పారిశుద్ధ్య నిర్వహణ చేపడుతున్నారు.



చెత్త సేకరిస్తున్న సిబ్బంది

### ఇబ్బంది లేకుండా చెత్త సేకరణ

పట్టణంలో చెత్త సేకరణకు ఎలాంటి ఇబ్బంది లేదు. ఏజెన్సీలతో చర్చలు జరుగుతున్నాయి. క్లాప్ వాహనాల స్థానంలో పుష్ కార్టుల ద్వారా చెత్త సేకరణ జరుగుతోంది.

-ఏసుబాబు, కమిషనర్

### మేమున్నాం.. మీకు తోడుగా..

10 AM to 1 PM

| | |
|---|---|
| తాడేపల్లిగూడెం | : 79950 67078 |
| పెంటపాడు | : 79939 36123 |
| తణుకు గ్రామీణ | : 85558 50851 |
| అత్తిలి | : 91548 46774 |

**తాడేపల్లిగూడెం వన్‌టౌన్, న్యూస్‌టుడే**

**సమస్య:** తాడేపల్లిగూడెం హౌసింగ్‌బోర్డు కాలనీ శివారు ప్రాంతంలో పురపాలక కుళాయి నుంచి కలుషితమైన నీరు వస్తోంది. **- గోపి, స్థానికుడు**

**సమాధానం:** పరిశీలించి స్వచ్ఛమైన నీరు సమృద్ధిగా వచ్చేలా చర్యలు చేపడతాం. **-ఏసుబాబు, పురపాలక కమిషనర్**

**సమస్య:** తాడేపల్లిగూడెం పట్టణం కడకట్ల హెచ్‌పీ గ్యాస్ గోదాముల రోడ్డులో పందుల సంచారంతో పరిసరాలు కాలుష్యం అవుతున్నాయి **- వీరేంద్ర, స్థానికుడు**

**సమాధానం:** పందుల సంచారాన్ని అరికట్టేలా చర్యలు చేపడతాం **-శ్రీమన్నారాయణ, శానిటరీ ఇన్‌స్పెక్టర్**

**పెంటపాడు, న్యూస్‌టుడే**

**సమస్య :** పెంటపాడు మండలం కస్పాపెంటపాడు తూర్పు ఎస్సీ కాలనీలో ఎక్కడచూసినా డ్రెయిన్లు వ్యర్థాలతో పూడిపోవడం, పలు చోట్ల చెత్తకుప్పలు దర్శనమిస్తుండటంతో స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. **-నరేష్, స్థానికుడు**

**సమాధానం:** పారిశుద్ధ్యం మెరుగుదలకు కృషిచేస్తాం. **- పీతల సత్యనారాయణ, సర్పంచి**

**సమస్య:** పెంటపాడు మండలం మీనవల్లూరులో రెండు రోజులుగా చెత్తసేకరణ సక్రమంగా జరగకపోవడంతో ఇళ్లల్లో చెత్త పేరుకుపోయింది. పంచాయతీవారికి ఫిర్యాదు చేసినా పట్టించుకోవడంలేదు. **- నారాయణ, స్థానికుడు**

**సమాధానం :** చెత్త సేకరణ సక్రమంగా జరిగేలా చర్యలు తీసుకుంటాం. **- చింతపల్లి లక్ష్మి, సర్పంచి**

## సమస్యల పరిష్కారానికి 'గ్రామదర్శిని'



సమస్యలు తెలుసుకుంటున్న ఆరిమిల్లి

**తణుకు గ్రామీణం, న్యూస్‌టుడే:** అయిదేళ్ల వైకాపా పాలనలో తణుకు మున్సిపాలిటీలో పారిశుద్ధ్యం క్షీణించిందని, ఈ తరహా సమస్యలకు స్వస్తి పలికేందుకు గ్రామదర్శిని కార్యక్రమం చేపట్టామని ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ పేర్కొన్నారు. ఈ మేరకు మంగళవారం తణుకు 22వ వార్డులో రాధాకృష్ణ పర్యటించి స్థానికులను అడిగి సమస్యలను తెలుసుకున్నారు. వైకాపా పాలనలో పట్టణంలో డ్రెయినేజీ పూడిక పనులు చేపట్టిన దాఖలాలు లేవని ఆరోపించారు. దీంతో చిన్నపాటి వర్షానికి మురుగు పారక రహదారులు కాలువలను తలపిస్తున్నాయన్నారు. ఈ వార్డులోని నల్లజర్ల వారి వీధిలో రూ.23 లక్షలతో సీసీ రోడ్డు నిర్మాణానికి చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఖాళీ స్థలాల యజమానులు అందులో ఉండే మొక్కలను, చెత్తను పూర్తిగా తొలగించాలన్నారు. వార్డులో అభివృద్ధి పనులకు 15వ ఆర్థిక సంఘం నుంచి రూ.కోటి నిధులతో డ్రెయినేజీ నిర్మాణాలకు ప్రతిపాదనలు పంపిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో ఎన్డీయే నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక



**కొమ్ముగూడెం(తాడేపల్లిగూడెం వన్‌టౌన్), న్యూస్‌టుడే:** ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో నిర్వహిస్తున్న అండర్-17 ఎస్‌జీఎఫ్ క్రీడా పోటీల్లో తాడేపల్లిగూడెం మండలం కొమ్ముగూడెం జిల్లాపరిషత్తు ఉన్నత పాఠశాల విద్యార్థి పూరిళ్ల నానిబాబు హైజంప్‌లో ప్రతిభ కనబరిచి జిల్లాలో ప్రథమ స్థానంలో నిలిచాడని పాఠశాల ప్రధానోపాధ్యాయుడు జి.శ్రీనివాసరావు మంగళవారం తెలిపారు. శ్రీకాకుళంలో నిర్వహించే రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యాడని వివరించారు. ఈ సందర్భంగా నానిబాబు, వ్యాయామ ఉపాధ్యాయిని కొత్త సుభద్రలను సర్పంచి తాడేపల్లి బేబి, ఎంపీటీసీ సభ్యుడు సూర్పని రామకృష్ణ, ఉపాధ్యాయులు అభినందించారు.

## ఉత్సాహం.. ప్రతిభకు ప్రోత్సాహం

### 'ఈనాడు' ఆధ్వర్యంలో వ్యాసరచన పోటీలు



తాడేపల్లిగూడెం: విజేతలతో ప్రధానోపాధ్యాయుడు సత్యనారాయణ, ఉపాధ్యాయులు



తణుకు: బహుమతులు అందజేస్తున్న పాఠశాల డైరెక్టర్లు

**తాడేపల్లిగూడెం అర్బన్, న్యూస్‌టుడే:** తాడేపల్లిగూడెం జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలలో 'ఈనాడు' ఆధ్వర్యంలో మంగళవారం ప్రతిభా పాటవ పోటీలు నిర్వహించారు. 'చరవాణి వినియోగంతో లాభనష్టాలు, మీకు ఎదురైన అనుభవాలు' అనే అంశంపై నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచిన కె.ఆదిత్య మణికంఠ, ఎంఎల్‌వీఎస్ బాలాజి, ఎస్‌కే.మస్తాన్‌బీలకు ప్రధానోపాధ్యాయుడు ఎం.సత్యనారాయణ బహుమతులు అందజేశారు.

**తణుకు గ్రామీణం, న్యూస్‌టుడే:** తణుకు రూట్స్ ఆంగ్ల మాధ్యమ పాఠశాలలో 'ఈనాడు' ఆధ్వర్యంలో మంగళవారం ప్రతిభా పాటవ పోటీలు నిర్వహించారు. 'అంతర్జాలంతో లాభనష్టాలు, విద్యార్థులపై సామాజిక మాధ్యమం ప్రభావం' అనే అంశంపై వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఎన్ జన్మయిశ్రీ, పి జోష్నశ్రీ, ఎ.ప్రశాంత్ ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచారు. విజేతలకు డైరెక్టర్లు ఎల్‌కె త్రిపాఠి, విద్యాకాంత్ బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు కె నాగదుర్గా, సీహెచ్ శ్రీలక్ష్మి పాల్గొన్నారు.

## సమస్యలు పరిష్కరించాలని డిమాండ్

**తణుకు గ్రామీణం, న్యూస్‌టుడే:** మున్సిపాలిటీలోని క్లాప్ డ్రైవర్లు ఎదుర్కొంటున్న సమస్యలు వెంటనే పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి పీవీ ప్రతాప్, మండల కార్యదర్శి గుబ్బల గోపి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం సీఐటీయూ ఆధ్వర్యంలో స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. గాంధీ విగ్రహానికి, డిప్యూటీ తహసీల్దార్ శ్రీదేవికి వినతిపత్రాలు అందజేశారు. క్లాప్ డ్రైవర్లకు ఉద్యోగ భద్రత కల్పించి, పెండింగ్‌లో ఉన్న వేతనాలు, పీఎఫ్ బకాయిలు తక్షణమే చెల్లించాలన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ సీనియర్ నాయకులు రంగారావు, సురేంద్ర, గణేష్, కేశవరావు, తాతారావు, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.



గాంధీ విగ్రహం వద్ద మోకాళ్లపై నిరసన తెలుపుతున్న క్లాప్ డ్రైవర్లు, నాయకులు

## గ్రామ సభలతో సమస్యల పరిష్కారం

**తాడేపల్లిగూడెం అర్బన్, న్యూస్‌టుడే:** గ్రామ సభల ద్వారా గుర్తించిన సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తామని ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ పేర్కొన్నారు. తాడేపల్లిగూడెం మండలం వెంకట్రామన్నగూడెంలో పల్లె పండుగ కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన గ్రామసభలో ఆయన మాట్లాడుతూ గతంలో జరిగిన సర్వేల్లో లోపాలను సరిదిద్దేందుకు ఎన్డీయే ప్రభుత్వం గ్రామ సభలు నిర్వహిస్తోందన్నారు. ఈ సందర్భంగా వచ్చిన ఫిర్యాదులను పరిష్కరించేందుకు కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో ఆర్డీవో భవాని శంకరి, తహసీల్దార్ సునీల్, నాయకులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే బొలిశెట్టి



### బహుమతుల అందజేత

**అత్తిలి గ్రామీణం, న్యూస్‌టుడే:** పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని సోమవారం అత్తిలి ఎంపీయూపీ పాఠశాలలో గ్రామంలోని వివిధ పాఠశాలల విద్యార్థులకు చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. విజేతలకు మంగళవారం అత్తిలి ఎస్సై ప్రేమరాజు చేతుల మీదుగా బహుమతులు అందజేశారు.

### భర్త వేధింపులపై కేసు

**పట్టెంపాలెం (తాడేపల్లిగూడెం వన్‌టౌన్), న్యూస్‌టుడే:** తన భర్త మద్యం తాగి వేధిస్తున్నాడని ఓ మహిళ ఇచ్చిన ఫిర్యాదుపై కేసు నమోదు చేసినట్లు గ్రామీణ ఎస్సై జేవీఎన్ ప్రసాద్ తెలిపారు. ఆయన కథనం మేరకు.. కోరుమామిడికి చెందిన మద్దుల శ్రీనుబాబు నిత్యం మద్యం తాగి భార్య లక్ష్మీదుర్గను శారీరకంగా, మానసికంగా వేధిస్తుండటంతో ఆమె పుట్టిల్లు తాడేపల్లిగూడెం మండలం పట్టెంపాలెంకు వచ్చేశారు. ఈమేరకు గ్రామీణ పోలీసు స్టేషన్లో ఫిర్యాదు చేశారు.

# ఒళ్లు.. బళ్లు గుల్ల

### అధ్వానంగా గ్రామీణ రహదారులు

**పెంటపాడు, న్యూస్‌టుడే**

గత వైకాపా ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగా పెంటపాడు మండలంలోని గ్రామీణ రహదారులపై ప్రయాణం అంటేనే ప్రజలు హడలెత్తిపోతున్నారు. ద్విచక్ర వాహనాలు గుల్లగుల్లవుతున్నాయి. అవి గుంతల్లో పడి చోదకుల నడుములు విరుగుతున్నాయి. కొన్ని రోడ్లు రాళ్లుతేలితే... మరికొన్ని చోట్ల గుంతలు అగాధాలను తపిస్తున్నాయి. ఇంకొన్ని చోట్ల కల్వర్టులు భయపెడుతున్నాయి.

### ఇదీ పరిస్థితి

మండలంలోని పెంటపాడు నుంచి జట్లపాలెం, కస్పాపెంటపాడు నుంచి పడమరవిప్పర్రు, ఉమామహేశ్వరం, పెంటపాడు నుంచి దర్శిపర్రు, వల్లూరుపల్లి, రాచర్ల, అలంపురం నుంచి రావిపాడు, రావిపాడు నుంచి బి.కొండేపాడు, మీనవల్లూరు, రామచంద్రాపురం, బి.కొండేపాడు నుంచి కోరుమిల్లి, చింతపల్లి, కాశిపాడు, చిలకంపాడు లాకులు, కాశిపాడు నుంచి మీనవల్లూరు, జట్లపాలెం నుంచి మౌంజీపాడు, కాకర్లమూడి, కస్పాపెంటపాడు నుంచి ఆకుతీగపాడు, అలంపురం నుంచి ప్రత్తిపాడు వెళ్లే రహదారులు పెద్దపెద్ద గోతులు పడి అధ్వానంగా ఉన్నాయి. ఆయా మార్గాల్లో ప్రయాణిస్తున్నవారు నిత్యం నరకం చూస్తున్నారు.

ఇది మండల కేంద్రం పెంటపాడు నుంచి బోడపాడు వెళ్లే ర.భ.శా రహదారి. దశాబ్దకాలంగా ఈ మార్గం గోతులు పడి అధ్వానంగా మారింది. కొత్త రోడ్డు నిర్మించాలని గ్రామస్థులు ప్రజాప్రతినిధులను, అధికారులను కోరుతున్నా ప్రయోజనం లేదు. కనీసం గోతులు పూడ్చకపోవడంతో ఇటీవల కురుస్తున్న వర్షాలకు అవి మరింత పెద్దవిగా మారాయి. గ్రామం మండల కేంద్రానికి సమీపంలో ఉన్నా బస్సు సౌకర్యం లేకపోవడంతో గ్రామస్థులు ఆటోలను ఆశ్రయిస్తున్నాయి. గోతుల కారణంగా ఈ గ్రామానికి వెళ్లేందుకు ఆటో నడిపే వారు నిరాకరిస్తుండటంతో 5 కిలోమీటర్లు నడవాల్సి వస్తోందని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



గోతులమయంగా బోడపాడు మార్గం



గుంతలమయంగా మౌంజీపాడు దారి

ఇది పెంటపాడు మండలం జట్లపాలెం నుంచి మౌంజీపాడు, కాకర్లమూడి వెళ్లే రహదారి. ఈ మార్గం గత అయిదేళ్లుగా రాళ్లుతేలి గుంతలు పడటంతో రాకపోకలు సాగించేందుకు ఆయా గ్రామాల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. లేచిన రాళ్లు, గుంతల ధాటికి ద్విచక్ర వాహనాలు తరచూ పంక్చర్లు పడటం, మరమ్మతులకు గురవుతున్నాయని వాహనచోదకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

### ఉన్నతాధికారులకు నివేదించాం

పెంటపాడు మండలంలోని రహదారులను పరిశీలించాం. నూతనంగా నిర్మించేందుకు, మరమ్మతులు చేపట్టేందుకు అంచనాలను సిద్ధం చేసి ఉన్నతాధికారులకు నివేదించాం. నిధులు మంజూరు కాగానే పనులు చేపడతాం.

-రవిబాబు, ఏఈ, ర.భ.శా. తాడేపల్లిగూడెం

## అడ్డంకులతో ఇబ్బందులు

### తాగునీరు కలుషితం

**పెంటపాడు, న్యూస్‌టుడే :** పెంటపాడు మండలంలోని అలంపురం నుంచి జట్లపాలెం వరకు మిడ్‌లెవల్ కాలువలో పలుచోట్ల ఏర్పడిన అడ్డంకులను తొలగించకపోవడంతో వ్యర్థాలు ఎక్కడికక్కడ నిలిచిపోయి తాగు, సాగునీరు కలుషితమవుతోంది. పదిరోజుల క్రితం దర్శిపర్రు శివారులోని ఓ వృక్షం కాలువలో పడిపోవడంతో పైనుంచి కొట్టుకొస్తున్న వ్యర్థాలు అక్కడ నిలిచిపోయాయి. చెట్టు, వ్యర్థాలను తొలగించాల్సిన జలవనరులశాఖ అధికారులు ఇప్పటివరకూ పట్టించుకోలేదు. దీంతో ఆ ప్రాంతంలో వ్యర్థాలు, తూడు కుళ్లి దుర్వాసన వస్తోంది. ఇదేపరిస్థితి జట్లపాలెం, పెంటపాడు, వల్లూరుపల్లి, రాచర్ల గ్రామాల్లో నెలకొంది. దీనిపై జలవనరులశాఖ ఏఈ వీఎస్.కిరణ్‌కుమార్ మాట్లాడుతూ తక్షణమే కాలువలోని అడ్డంకులను తొలగించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు.



### అయ్యప్పకు ప్రత్యేక అభిషేకాలు



**అత్తిలి గ్రామీణం, న్యూస్‌టుడే:** అత్తిలి రైల్వే స్టేషన్‌కు వెళ్లే మార్గంలో అయ్యప్పకు ఆలయ అర్చకులు వాడపల్లి సత్యనారాయణాచార్యులు మంగళవారం వివిధ రకాల పండ్లతో అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. రకరకాల పుష్పాలతో స్వామివారిని విశేషంగా అలంకరించారు.

### నత్తి నివారణకు ప్రత్యేక శిక్షణ



కార్యక్రమంలో పాల్గొన్న సిబ్బంది, ఉపాధ్యాయులు

**తాడేపల్లిగూడెం అర్బన్, న్యూస్‌టుడే:** పట్టణంలోని సుబ్బారావుపేట భవిత దివ్యాంగుల పాఠశాలలో అంతర్జాతీయ నత్తి నివారణ అవగాహన దినోత్సవాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రత్యేక ఉపాధ్యాయిని ఎం.చంద్రకుమారి మాట్లాడుతూ చిన్న వయసులోనే నత్తిని గుర్తించి స్పీచ్ థెరపీ చేయడం ద్వారా సమస్యను పరిష్కరించే అవకాశం ఉంటుందన్నారు. దీనికి మందులు లేవని ప్రత్యేక శిక్షణ ఒక్కటే మార్గమన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

### ఇబ్బందులుంటే ధైర్యంగా చెప్పండి



విద్యార్థులతో మాట్లాడుతున్న దశిక వంశీ

**అత్తిలి గ్రామీణం, న్యూస్‌టుడే:** పాఠశాలలో ఎటువంటి ఇబ్బందులున్నా ధైర్యంగా చెప్పాలని తహసీల్దార్ దశిక వంశీ విద్యార్థులకు సూచించారు. మంగళవారం అత్తిలి మండలం ఈడూరులోని జడ్పీ ఉన్నత పాఠశాలను పరిశీలించారు. ఈ సందర్భంగా పాఠశాలలో భోజన నాణ్యత, ఉపాధ్యాయుల బోధనపై ఆరా తీశారు. పోటీ పరీక్షల్లో విజయం సాధించేలా విద్యార్థులను తీర్చిదిద్దాలని ఉపాధ్యాయులకు సూచించారు. అనంతరం గ్రామసభలో పాల్గొని ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. కార్యక్రమంలో రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

## గ్రామ సభలు సద్వినియోగం చేసుకోండి



కోనాలలో వినతులు స్వీకరిస్తున్న తహసీల్దార్ వర్మ

**తణుకు గ్రామీణం, పెంటపాడు, న్యూస్‌టుడే:** రీసర్వే చేసిన గ్రామాల్లో భూయజమానులు తమ సమస్యలను నివృత్తి చేసుకునేందుకు నిర్వహిస్తున్న గ్రామసభలను సద్వినియోగం చేసుకోవాలని ఇరగవరం, తణుకు తహసీల్దార్లు సుందరరాజు, అశోక్ వర్మ కోరారు. ఇరగవరం, తణుకు మండలాల్లోని ఏలేటిపాడు, అయితంపూడి, కోనాల గ్రామాల్లో నిర్వహించిన సభల్లో రైతుల నుంచి వినతులను స్వీకరించారు.

● భూ రీ సర్వేపై పెంటపాడు మండలం బోడపాడు, ఆకుతీగపాడు గ్రామాల్లో సర్పంచులు గేదెల శివకుమార్, దాసం వెంకటేశ్వర్లు అధ్యక్షతన గ్రామసభలు నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న తహసీల్దార్ శ్రీనివాస్ మాట్లాడుతూ పొలాల రీ సర్వేలో సమస్యలు ఉంటే రైతులు తమ దృష్టికి తీసుకువస్తే పరిష్కారానికి చర్యలు చేపడతామన్నారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ కొణతాల వెంకట్రావు, మండల సర్వేయర్ రామకృష్ణ, ఎన్డీయే నాయకులు మట్టా సత్యనారాయణ, కొండపల్లి చినశ్రీను తదితరులు పాల్గొన్నారు.

## మలుపులు... ప్రమాదాలకు పిలుపులు

**అత్తిలి గ్రామీణం, న్యూస్‌టుడే:** గత వైకాపా పాలనలో రహదారులను కనీసం పట్టించుకున్న పాపానపోలేదు. దీంతో ప్రధాన మార్గాలు అధ్వానంగా మారి పెద్దపెద్ద గోతులతో దర్శనమిస్తున్నాయి. దీనికి తోడు రహదారుల మలుపుల వద్ద సూచిక బోర్డులు లేకపోవడంతో రాత్రి సమయాల్లో వాహనచోదకులు, ప్రయాణికులు ప్రమాదాలబారిన పడుతున్నారు. కూటమి ప్రభుత్వం రహదారుల నిర్మాణాలపై దృష్టి పెట్టాలని లక్ష్మీనారాయణపురం సర్పంచి పోలమరశెట్టి నాగేశ్వరరావు కోరారు. పరిశీలించి తగు చర్యలు తీసుకుంటామని ర.భ.శా జేఈ యశ్వంత్ తెలిపారు.



మంచిలి-కంచుమర్రు మలుపులో కోతకు గురైన ప్రధాన రహదారి



అత్తిలి - ఉరదాళ్లపాలెం మార్గం ఇలా..

### ఆంగ్లంపై పట్టు సాధిస్తే అన్ని రంగాల్లో రాణింపు

**గణపవరం, న్యూస్‌టుడే:** గణపవరంలోని శ్రీచింతలపాటి వరప్రసాద మూర్తిరాజు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో లక్ష్య నిర్దేశంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఎన్ఎస్ఎస్ యూనిట్ 1, 2, సెట్‌వెల్ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ప్రిన్సిపల్ పి.నిర్మలా కుమారి మాట్లాడారు. సెట్‌వెల్ సీఈవో ప్రభాకర్‌రావు మాట్లాడుతూ పోటీ ప్రపంచంలో ఆంగ్లంపై పట్టు సాధిస్తే అన్ని రంగాల్లో రాణించే అవకాశం ఉందన్నారు.

### 25 నుంచి వాహనాల దారి మళ్లింపు

**మార్టేరు, న్యూస్‌టుడే:** రహదారి నిర్మాణ పనుల రీత్యా మార్టేరు-పాలకొల్లు మార్గంలో 25 నుంచి వాహనాలను దారి మళ్లిస్తున్నట్లు ఆర్అండ్‌బీ ఏఈఈ యశ్వంత్ తెలిపారు. మార్టేరు పరిధిలో సుమారు 700 మీటర్లు మేర సిమెంట్ రోడ్డు నిర్మాణ పనులు చేపడుతున్నట్లు చెప్పారు. పాలకొల్లు వెళ్లాల్సిన వాహనదారులు ఆలమూరు, కొమ్ముచిక్కాల మీదుగా కవిటం లేదంటే లంకలకోడేరు మీదుగా పాలకొల్లు వెళ్లాలని సూచించారు. నరసాపురం, పాలకొల్లు నుంచి వచ్చే వాహనాలను సైతం ఈ మార్గంలోనే వచ్చే విధంగా మళ్లిస్తున్నట్లు తెలిపారు. డిసెంబర్ 10 తర్వాత పూర్తిస్థాయిలో వాహనాల రాకపోకలకు అనుమతిస్తామని చెప్పారు.



మాట్లాడుతున్న మురళీకృష్ణ

### అధిక ఎరువుల వినియోగంతో నష్టం

**కొండ్రుప్రోలు(తాడేపల్లిగూడెం వన్‌టౌన్), న్యూస్‌టుడే:** అధిక ఎరువుల వినియోగంతో రైతులు నష్టపోతున్నారని తాడేపల్లిగూడెం వ్యవసాయ సహాయ సంచాలకుడు మురళీకృష్ణ అన్నారు. మంగళవారం తాడేపల్లిగూడెం మండలం కొండ్రుప్రోలులో నిర్వహించిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. అధిక ఎరువులతో జరిగే నష్టాలను వివరించారు. శాస్త్రవేత్త డాక్టర్ రేఖ మాట్లాడుతూ నూతన సాంకేతిక పరిజ్ఞానంపై రైతులకు శిక్షణ ఇస్తున్నామని తెలియజేశారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి ఆర్ఎస్ ప్రసాద్, ఉద్యాన అధికారి శ్రీలక్ష్మి, పశువుల వైద్యాధికారిణి దివ్యశ్రీ తదితరులు పాల్గొన్నారు.

### 'సమస్యలను విస్మరించిన సర్కారు'

**తణుకు గ్రామీణం, న్యూస్‌టుడే:** కూటమి పరిపాలన స్తంభించిపోయిందని, దాచుకో, దోచుకో పంచుకో అన్న చందాన పాలన సాగిస్తున్నారని మాజీ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు విమర్శించారు. స్థానిక తన నివాసం వద్ద మంగళవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. మద్యం దుకాణాల్లో, ఇతర పనుల్లో పర్సంటేజ్‌ల మోజులో పడి ప్రజా పరిపాలన గాలికొదిలేశారనడానికి నిదర్శనం విజయనగరం జిల్లా గుర్లలో జరిగిన అతిసార ఘటన అని దుయ్యబట్టారు. ఈ సందర్భంగా వైకాపా ఉమ్మడి ప్రకాశం జిల్లా రీజినల్ కోఆర్డినేటర్‌గా నియమితులైన ఆయనను స్థానిక వైకాపా నాయకులు శాలువాతో సత్కరించారు.